భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# వర్తమాన రాజకీయ పరిస్థితులు

(జనవరి 30-31, 2021న సిపిఐ (ఎం)
కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# వర్తమాన రాజకీయ పరిస్థితులు

(జనవరి 30-31, 2021న సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)

## అంతర్జాతీయం

**పెరుగుతూనే ఉన్న కోవిడ్:** ప్రపంచ వ్యాపితంగా పది కోట్ల మంది కోవిడ్ బారిన పడ్డారు. వీరిలో అత్యధికులు అమెరికాలోనే (2.5 కోట్లు). ఆ తర్వాత స్థానంలో భారత్, బ్రెజిల్ దేశాలు ఉన్నాయి. ప్రపంచంలో ఈ వ్యాధి సోకినవారిలో 20 లక్షల మంది చనిపోయారు. భారతదేశంలో జనవరి 25 వరకు కోవిడ్ సోకినవారి సంఖ్య దాదాపు కోటి ఆరు లక్షలు. ప్రస్తుతం కోవిడ్ చికిత్స తీసుకుంటున్న వారు 2 లక్షల 15 వేల మంది. ఇప్పటివరకు ఈ వ్యాధి సోకి 1.5 లక్షల మందికి పైగా చనిపోయారు.

ఈమధ్య కాలంలో ఈ వైరస్ మార్పుచెంది మరో కొత్త వైరస్‌గా అవతరించింది. దీన్ని మొదట బ్రిటన్‌లో కనుగొన్నారు. ఇది కోవిడ్ కన్నా అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతుంది. తర్వాత ఈ కొత్త వైరస్ చాల దేశాలలో ప్రత్యేకించి ఐరోపా దేశాలలో కనిపించింది. భారత దేశంలో కూడ ఈ కొత్త రకం వైరస్ వందకు పైగా కేసుల్లో బయటపడింది. బ్రిటన్‌లో ఈ కేసులు విపరీతమైన వేగంతో పెరిగాయి. మరణాలు కూడ ఒక్కసారిగా పెరిగిపోయాయి. బ్రిటన్‌లో కచ్చితమైన లాక్ డౌన్ మళ్లీ విధించబడింది. ఎంతకాలం ఈ లాక్‌డౌన్ కొనసాగుతుందో ఇప్పుడు చెప్పలేం. జర్మనీ వంటి ఇతర ఐరోపా దేశాలు కూడా తరతమ స్థాయిల్లో లాక్‌డౌన్ అమలు చేస్తున్నాయి. ఫలితంగా చాల దేశాలలో సాధారణ జీవనానికి ఆటంకం ఏర్పడింది. అత్యధికులకు టీకా (వ్యాక్సినేషన్) వేసేంతవరకు ఈ సందిగ్ధత కొనసాగుతుంది.

**వ్యాక్సినేషన్** : వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రపంచ వ్యాపితంగా మొదలైంది. బ్లూమ్‌బర్గ్ పత్రిక చెప్పిన ప్రకారం భారత దేశంలో వ్యాక్సినేషన్ మొదలు కాకముందే 51 దేశాలలో, 4 కోట్ల 22 లక్షల మందికి పైగా ఈ వ్యాక్సినేషన్ అందింది. అంటే రోజుకు 24 లక్షల మంది చొప్పున ఈ వ్యాక్సినేషన్ తీసుకున్నారు. మొదటి విడతకు రెండో విడతకు మధ్య విరామంలో తేడాలున్నప్పటికీ దాదాపు అన్ని వ్యాక్సిన్లు రెండుసార్లు తీసుకోవాలి.

చైనా ఐదు రకాల వ్యాక్సిన్లు తయారు చేసింది. వీటిలో కరోనా వ్యాక్సిన్‌ను చైనా విస్తృతంగా వినియోగిస్తున్నది. చైనా ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగానూ, వాణిజ్య పరంగానూ అనేక దేశాలకు సరఫరా చేస్తున్నది. దాదాపు 20 దేశాలు వ్యాక్సిన్ సరఫరా కోసం చైనాతో ఒప్పందాలు చేసుకున్నాయి.

భారత దేశం, బ్రిటన్ ఆక్స్‌ఫర్డ్–ఆస్ట్రా జెనికా నుండి లైసెన్సు తీసుకొని కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను స్థానికంగా తయారు చేస్తున్నది. దీనితో పాటు భారత్ బయోటెక్ తయారు చేసిన కోవాక్జిన్ కూడా వినియోగానికి అనుమతి పొందింది.

కోవిషీల్డ్ అన్ని దశల పరీక్షలను పూర్తిచేసినప్పటికీ, కోవాక్జిన్ మాత్రం మూడో దశ పరీక్షను ముగించుకోలేదు. ఈ వ్యాక్సిన్ సమర్థత గురించి తీవ్రమైన సందేహాలు తలెత్తాయి. వీటితో పాటు టీకా వేయించుకున్న వారి క్షేమం గురించి కూడ ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇందుమూలంగానే టీకా వేయించుకోవడానికి ప్రజలు ఎక్కువమంది సందేహిస్తున్నారు. గతంలో అన్ని వ్యాక్సిన్ల మాదిరిగానే కరోనా వ్యాక్సిన్‌ను కూడ దేశ ప్రజలందరికీ ఉచితంగా వేయాలని పార్టీ డిమాండ్ చేసింది. కేరళలో రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సినేషన్ అందిస్తానని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రకటించింది. వ్యాక్సినేషన్ కార్యక్రమం కీలక దశకు చేరుకునేంత వరకు, ఆ తర్వాత కూడ భౌతిక దూరాన్ని పాటించడం, మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం లాంటి ముందుజాగ్రత్తలు తప్పనిసరి.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ :** గతంలోనే మనం గుర్తించినట్లు కోవిడ్ మహమ్మారి మొదలు కాకముందే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా మందగించింది. మహమ్మారి విజృంభించిన తర్వాత ప్రపంచబ్యాంకు జనవరి 2021 నివేదికలో అంచనా వేసినట్లు, “2020లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 4.3 శాతానికి కుదించుకుపోయింది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ఇంతకు మించిన సంక్షోభాలు గత శతాబ్దంన్నర కాలంలో రెండు ప్రపంచ యుద్ధాల సమయంలోను, మహాపతనం సమయంలోను మాత్రమే ఏర్పడ్డాయి.”

2021లో ప్రపంచ ఆర్థిక ఉత్పత్తి 4 శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఇది మహమ్మారికి ముందు అంచనాలకన్నా 5 శాతం తక్కువ. ఈ అంచనా కూడ మహమ్మారిని సమర్థవంతంగా అదుపుచేయడం, అన్ని దేశాలలోను టీకా వేయడం లాంటి అనేక షరతులతో కూడుకున్నది. అధ్వాన్న పరిస్థితిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 1.6 శాతానికి మాత్రమే పుంజుకుంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. పరిస్థితి మరీ తీవ్రంగా ఉంటే, 2021లో ప్రపంచ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి ప్రతికూలంలో సైతం పడవచ్చునని పేర్కొంది. మహమ్మారి నెమ్మదించిన తర్వాత కూడ ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు మహమ్మారి ముందరి స్థాయిని చేరుకునేట్లు కనిపించడం లేదని కూడ చెప్పింది.

**ప్రధాన పెట్టుబడిదారీ దేశాలు:** అమెరికా ఆర్థిక వ్యవస్థ 2020 ప్రథమార్థంలో 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో క్షీణించిన అత్యధిక స్థాయికన్నా మూడు రెట్లు

అధికంగా క్షీణించింది. అధికారిక అంచనాల ప్రకారమే అమెరికా జిడిపి 3.6 శాతానికి పడిపోయింది.

**ఐరోపా యూనియన్ :** ప్రాంత ఆర్థిక అభివృద్ధి 2020లో 5.3 శాతం పడిపోయింది. 2021లో 3.6 శాతం అభివృద్ధి జరుగుతుందని అంచనా. ఇది మహమ్మారి ముందరి కన్నా 3.8 శాతం తక్కువ.

**జపాన్ :** ఆర్థిక వ్యవస్థ 2020లో 5.3 శాతం క్షీణించింది. 2021లో 2.5 శాతం అభివృద్ధి జరుగుతుందని అంచనా. ఇది మహమ్మారి ముందరి కన్నా 2.4 శాతం తక్కువ.

**వర్ధమాన దేశాలు**: ప్రపంచ వ్యాపితంగాను, ప్రత్యేకించి వర్ధమాన దేశాలలో పెట్టుబడులు తీవ్రంగా పడిపోయాయి. 2020లో స్వల్ప ఆదాయ దేశాలలో పెట్టుబడులు 0.9 శాతం కుదించుకు పోయాయి. ఇది ఒక తరంలో మొట్టమొదటి సారి పెట్టుబడులు కుదించుకు పోవడం. ఈ దేశాలు దాదాపు 5 శాతం పుంజుకుంటాయని అంచనాలు వేస్తున్నప్పటికీ, ఇది ప్రధానంగా చైనా ఆర్థిక వ్యవస్థ సమర్ధవంతమైన పనితీరు వల్లనే.

**పెరుగుతున్న ప్రజల కష్టాలు**: ప్రపంచ బ్యాంకు నివేదిక ఇలా చెప్పింది, "మహమ్మారి మూలంగా తీవ్ర ప్రాణ నష్టం జరిగింది. కోట్లాది మందిని కటిక దారిద్ర్యంలోకి నెట్టివేసింది. ఆర్థిక కార్యకలాపాలు కాని, ఆదాయాలు కాని దీర్ఘకాలం పాటు మహమ్మారి పూర్వ దశ కన్నా చాల తక్కువ కొనసాగేట్లు చెరిగిపోని గుర్తులు మిగులుస్తుంది."

2020లో 90 శాతానికి పైగా వర్ధమాన దేశాలలో తలసరి ఆదాయాలు పడిపోయాయి. ఫలితంగా కోట్లాదిమంది తిరిగి దారిద్ర్యం లోకి నెట్టివేయబడ్డారు. 2020లో దాదాపు పదేళ్ల పాటు పెరిగిన తలసరి ఆదాయ స్థాయి తుడిచిపెట్టుకు పోతుంది. ఇది పేదరికం స్థాయిని కనీసం 2017 స్థాయికి, అంతకన్నా అధ్వాన్నంగానూ పడిపోయేలా చేస్తుంది. కోల్పోయిన ఉపాధి పునరుద్ధరించబడటానికి కూడ చాలాకాలం పడుతుంది.

పది కోట్ల మందికి పైగా దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేయబడతారు. ఇదే సమయంలో అసమానతలూ మరింత పెరిగిపోతాయి. ధనవంతులు మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా మారతారు. ఈ పర్యవసానాల తాకిడికి గురయ్యే బలహీన వర్గాలు అత్యధికంగా మహిళలు, వలస కార్మికులు, నైపుణ్యరహిత కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. విద్యారంగంలో ఏర్పడిన అంతరాయాలు ప్రత్యేకించి మౌలిక సదుపాయాలు అంతగా లేని, సాంకేతిక ప్రసార

సాధనాలు నాసిరకంగా ఉన్న దేశాలలో దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి.

**సోషలిస్టు దేశాలు**: సోషలిస్టు దేశాలలో చైనా ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి ఫలితాలను చూపించింది. మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోవడం, ప్రభుత్వ పెట్టుబడులు భారీ స్థాయిలో పెంచే ఉద్దీపనలు దీనికి కారణం. 2020లో చైనా జిడిపి 2.3 శాతం పెరిగింది. 2021లో ఈ పెరుగుదల 7.9 వరకు ఉంటుందని అంచనా. చైనాలో నిరుద్యోగం ప్రభుత్వ లక్ష్యమైన 6 శాతం కన్నా తగ్గింది. 2020లో పట్టణ ప్రాంతాలలో 1.2 కోట్ల ఉద్యోగాలు కొత్తగా కల్పించబడినాయి. దీనితో 2020 డిసెంబరు నాటికి నిరుద్యోగం రేటు 4.7 శాతానికి తగ్గిపోయింది.

**వియత్నాం:** ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2020లో వియత్నాంలో జిడిపి 2.91% పెరిగింది. ఈ కాలంలో పన్నులను, భూమి శిస్తులను వాయిదా వేసింది, వడ్డీరేట్లను తగ్గించింది. పరపతి సదుపాయాన్ని పెంచడం ద్వారా పెట్టుబడులకు ఊపు కల్పించింది. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా దేశీయ గిరాకీని సృష్టించింది. కోవిడ్ వ్యాధి సోకినవారు 1547 మాత్రమే. మరణాలు కేవలం 35.

**లావోస్**: నిరంతర అభివృద్ధిని కొనసాగించింది, కరోనా కేసులు కేవలం 41, మరణాలు లేవు.

**క్యూబా**: ఈ కాలంలో మహమ్మారి దాడి, అమెరికా సామ్రాజ్యవాదులు విధించిన ఇనుప సంకెళ్లు లాంటి ఆర్థిక దిగ్బంధనం– ఈ రెండు జంట ప్రమాదాలను తట్టుకొని క్యూబా విజయవంతంగా నిలబడింది. ప్రజారోగ్య రంగంలో వ్యయాన్ని పెంచడం, టూరిజం ఆదాయం పడిపోవడంతో క్యూబా ఆర్థికవ్యవస్థ 11 శాతం కుదించుకుపోయింది. అయినప్పటికీ మహమ్మారిని ఎదుర్కోవడానికి 39 దేశాలకు వైద్య సహాయాన్ని అందించింది.

**అమెరికా అధ్యక్ష ఎన్నికలు :** అమెరికా అధ్యక్షుడిగా రెండో దఫా ఎన్నిక కావడంలో డోనాల్డ్ ట్రంప్ విఫలమయ్యాడు. గెలుపొందిన డెమొక్రాటిక్ పార్టీకి చెందిన జోసెఫ్ ఆర్ బైడెన్ జూనియర్, 51.3 శాతం ప్రజల ఓట్లు పొందాడు. ఒక సిట్టింగ్ అధ్యక్షుడిపై ఇంత ఎక్కువగా ప్రజల ఓట్లు పొందినవారు 1932 తర్వాత ఎవరూ లేరు. 1900 తర్వాత మొత్తం ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజల శాతం కూడ ఇదే అత్యధికం. 8.1 కోట్ల మంది ఓటర్లు బైడన్‌కు ఓటు వేశారు. ట్రంప్‌కు 7.6 కోట్లకు పైగా ప్రజల ఓట్లు లభించాయి. ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లు బైడెన్‌కు 306 రాగా, ట్రంప్‌కు 232 వచ్చాయి.

ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలోను, ఆ తర్వాత కూడ డోనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ ఎన్నికలను అడ్డుకోవడానికి, ఫలితాలను తారుమారు చేయడానికి పాల్పడిందని, ఎన్నికల్లో పెద్ద ఎత్తున మోసం జరిగిందని ఆరోపణలు చేశాడు. "ఈ దొంగతనాన్ని ఆపివేయండి" అనే నినాదాన్ని ట్రంప్ లంకించుకున్నాడు. ఫలితంగా, జనవరి 6న, పార్లమెంటు ఉభయ సభలు ఎన్నికల తీర్పును ధృవీకరించడానికి సమావేశమవ్వగా, ఆ సమయంలో సాయుధులైన ట్రంప్ అనుయాయులు పార్లమెంటు భవనమైన కాపిటల్‌పై దాడి చేసి, విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో ఐదుగురు మరణించారు. "హింసాకాండకు ప్రేరేపించాడు" అనే ఆరోపణపై జనవరి 13న ట్రంప్‌పై పార్లమెంటులో విచారణ జరిగింది. 'తిరుగుబాటును ప్రేరేపించాడు' అన్న అభిశంసనకు గురయ్యాడు.

ప్రపంచ వ్యాపితంగా ఉన్న ట్రంప్ మితవాద మిత్రులు బైడెన్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు పూనుకున్నప్పటికీ, ట్రంప్ పరాజయంతో వారంతా తీవ్ర ఆశాభంగానికి గురయ్యారు. ఈ అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఎలాంటి అంచనాలు వ్యక్తమైనప్పటికీ, మన పార్టీ మాత్రం అమెరికా ప్రపంచాధిపత్య ప్రయత్నాలలో గుర్తించదగిన ఎలాంటి మార్పు ఉండబోదని భావించింది. ఒక పులి తన మచ్చలను ఎప్పటికీ మార్చుకోలేదు.

అయినప్పటికీ అధ్యక్షుడిగా ఎన్నికైన బైడెన్, జనవరి 14న ఆర్థిక తిరోగమనాన్ని, కోవిడ్-19 సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి 1లక్ష 90 కోట్ల డాలర్ల రక్షణ ప్యాకేజ్‌ను ప్రతిపాదించాడు. జనవరి 20న అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న బైడెన్ కోవిడ్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వ స్పందనలో మార్పు రావాలని అనేక మాసాలుగా డెమొక్రాటిక్ పార్టీ డిమాండ్ చేస్తున్నదానికి అనుగుణంగా, విస్తృతమైన సహాయానికి ప్రతిపాదనలను వివరించాడు. ఈ ప్రతిపాదనల్లో నేరుగా నగదు బదిలీలు, నిరుద్యోగ భృతి, ఇండ్ల అద్దె ఉపశమనాలు, ఆహార సహాయం, చిన్న వ్యాపారస్తులకు సహాయం, కరోనాపై ముందుడి పోరాడుతున్న వారి అవసరాల కోసం కేటాయింపులు ఉన్నాయి.

జనవరి 20న అధికార బాధ్యతలు స్వీకరించిన బైడెన్ కొన్ని గంటల్లోనే ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన అనేక విధాన ఆదేశాలను రద్దు చేశాడు, 17 కొత్త ఆదేశాలను జారీచేశాడు. అమెరికాకు వలస వచ్చే వారిపై, పౌరులు కానివారిని జనాభా లెక్కలలో లెక్కించడం, తగిన అనుమతి పత్రాలు లేకుండా దేశంలోకి ప్రవేశించిన వారిని బలవంతంగా బయటకు పంపించడంపై ఆదేశాన్ని రద్దుచేయడం, లైబీరియన్లను తిప్పి పంపివేయడాన్ని నిలిపి వేయడం, అనేక ముస్లిం దేశాల నుండి, ఆఫ్రికా దేశాల నుండి అమెరికాకు రాకపోకలను నిషేధించే 'ముస్లింల నిషేధం'

ఆదేశాన్ని ఉపసంహరించడం, మెక్సికోకు అమెరికాకు మధ్య సరిహద్దుపై గోడ నిర్మించడాన్ని నిలిపివేయడం మొదలైన ఉత్తర్వులు వీటిలో ఉన్నాయి. వాతావరణ మార్పుకు సంబంధించిన పారిస్ ఒప్పందంలో అమెరికా తిరిగి చేరడానికి లేఖపై బైడన్ సంతకం లాంటి ముఖ్యమైన ఆదేశం, ప్రపంచ ఆరోగ్య సంస్థతో సంబంధాలు పునరుద్ధరించుకోవడం లాంటివి కూడ ఈ చర్యల్లో ఉన్నాయి. అంతేకాకుండా వర్ణ, ఎల్‌జిబిటి సమానత్వం, పర్యావరణం, అమెరికా చరిత్రలో బానిస వ్యవస్థ పాత్ర మొదలైన వాటిపై కూడ బైడెన్ పలు నిర్ణయాలు తీసుకున్నారు.

బైడెన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ట్రంప్ హాజరు కాలేదు. ట్రంప్ హయాంలోని ఉపాధ్యక్షుడు మాత్రం వచ్చాడు. ట్రంప్ కార్యాలయాన్ని వదిలి వెళ్ళేటప్పుడు 140 క్షమాపణ/ సమాచార ఆదేశాలపై సంతకాలు చేశాడు.

ట్రంప్ ఓడిపోవడం భారత ప్రధాని మోడీకి పెద్ద ఎదురు దెబ్బ. ఎందువల్లనంటే, ట్రంప్‌ను తిరిగి ఎన్నుకోవాలంటూ అమెరికాలో పెద్దఎత్తున ప్రచారం చేసి వచ్చాడు. ట్రంప్ భారత దేశానికి వచ్చినప్పుడు అట్టహాసంగా స్వాగతాలు, విందులు ఏర్పాటు చేశాడు. ఇదే సమయంలో భారత విదేశాంగ శాఖ బైడెన్ భారత దేశం పట్ల మరింత స్నేహపూర్వకంగా ఉంటాడని చెప్పుకుంటూ అమెరికా ప్రభుత్వంతో నూతన సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నది. ఈ సమయంలోనే అమెరికా పార్లమెంటులోని డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు భారతదేశ పరిణామాల పట్ల విమర్శనాత్మక వైఖరి తీసుకున్నారు. భారతదేశం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా ఉండే సంబంధాన్ని గత ఆరేళ్ళుగా ట్రంప్ హయాంలో ప్రధాని మోడీ మరింత పటిష్టపరిచిన తర్వాత భవిష్యత్తులో అమెరికా–భారత్ సంబంధాలు ఎలాంటి రూపుధరించ బోతాయోనన్నదాన్ని నిశితంగా పరిశీలిస్తూ ఉండాలి.

**వెనిజులా :** గత డిసెంబరు 6న వెనిజులా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో పిఎస్‌యువి కూటమి, జిపిపి కూటమి మొత్తం 277 స్థానాలకు గాను 253 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇది ప్రజల ఘన విజయమని, "ప్రజాస్వామ్యానికి గొప్ప విజయం" అని అధ్యక్షుడు మదురో వర్ణించాడు. ఒక పెద్ద మార్పు మొదలు కాబోతున్నదని, సార్వభౌమాధికారంతో, స్వతంత్రతతో, శాంతియుత వాతావరణంలో ఆర్థిక పునరుద్ధరణ కోసం పని మొదలు కాబోతున్నదని కూడా ఆయన చెప్పారు.

అమెరికా దిగ్బంధనం నుండి సవాళ్ళు, వెనిజులా అంతరంగిక వ్యవహారాలలో అమెరికా జోక్యం ఇకముందు కూడ కొనసాగుతాయి. అమెరికా నాయకత్వంలోని దిగ్బంధనం ఫలితంగా విదేశాలలో డిపాజిట్ చేసిన బంగారం, ఆస్తులు స్వాధీనం చేసుకోవడంతో వెనిజులా 3000 వేల కోట్ల డాలర్లు విలువ చేసే సంపద నష్టపోయింది.

పిడివిఎస్ఏ అమెరికా అనుబంధ సంస్థ సిటిజిఓను అమ్మివేసే క్రమాన్ని ప్రారంభించడం, ట్రంప్ ప్రభుత్వం వెనిజులా ప్రభుత్వంపై జరిపిన చివరి దాడుల్లో ఒకటి. పిడివిఎస్ఏ వెనిజులా ప్రభుత్వరంగ చమురు సంస్థ. దీని అనుబంధ సంస్థ అయిన సిటిజివో గ్యాసోలిన్, లూబ్రికెంట్స్, పెట్రోకెమికల్స్‌ను అమెరికాకు అందించే ప్రధాన సరఫరాదారు. వెనిజులాలోని పచ్చి మితవాద గ్రూపులు తమ గురువు ట్రంప్‌ను అనుసరిస్తూ, వెనిజులా ఎన్నికలు చట్టవిరుద్ధమని చెప్పే ప్రయత్నాలలో మున్మురంగా మునిగిపోయాయి. ‘‘పాలనా కొనసాగింపు’’ అనే వ్యూహాన్ని ఈ గ్రూపులు ప్రకటించాయి.

**క్యూబాపై అమెరికా ఆంక్షలు :** ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న చివరి చర్యల్లో ఒకటి క్యూబాను మరొక సారి “ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాద దేశం”గా ప్రకటించడం. అమెరికా ఆంక్షలకు తోడు క్యూబాను ఇలా ప్రకటించడం, ఆ దేశంపై ఎదురుదాడి తప్ప మరేమీ కాదు. ఈ తాజా ఎదురుదాడిని ఎదుర్కొంటూనే, క్యూబా ప్రజారోగ్య రంగంలో మరింత ముందుకు సాగింది. మూడు రకాల కోవిడ్ వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసింది. అవి ఇప్పుడు పరీక్షల దశలో ఉన్నాయి. ఒక కోవిడ్ మహమ్మారి ఉండగానే, శిశుమరణాల రేటును తగ్గించింది. క్యూబాలో 9771 కోవిడ్ పాజిటివ్ కేసులు ఉండగా, మరణాలు 137 మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లోనే క్యూబా తన ఆర్థిక వ్యవస్థ వేగాన్ని పెంచడానికి కొత్త చర్యలను చేపట్టింది.

**బ్రెజిల్ : స్థానిక సంస్థల ఎన్నికలు :** 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో పచ్చిమితవాదులకు పెద్ద ఎదురు దెబ్బలు తగిలాయి. మధ్యేవాద మితవాద పార్టీలు పెద్ద ఎత్తున లాభపడ్డాయి. అధ్యక్షుడు జెయిర్ బోల్సనారోకు, ఆయన మితవాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు నిర్ణయాత్మకంగా కదిలారు. 25 అతిపెద్ద నగరాలలో సోషలిస్టు పార్టీ (పిటి) కి చెందిన 47 మంది సిటీ కౌన్సిలర్లుగా ఎన్నిక కాగా, పిసి డో బి ఆరు నగరాల్లో కౌన్సిలర్ స్థానాలను గెలుచుకొంది. అయితే, వామపక్షాల బలం ఈ ఎన్నికల్లో బాగా తగ్గిపోయింది. పిటి మేయర్లు 254 నుండి 174 నుండి తగ్గిపోయారు, పిసి డో బి మేయర్లు 81 నుండి 45కు తగ్గిపోయారు.

**ఇజ్రాయల్ : ప్రభుత్వం రద్దు**

ఇజ్రాయల్‌లో సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం పార్లమెంటు రద్దుకు దారితీసింది. ఫలితంగా ఇజ్రాయల్ కేవలం రెండేళ్ళలో 4వ సార్వత్రిక ఎన్నికలకు వెళుతున్నది. బెంజమిన్ నెతన్యాహు అవినీతి కుంభకోణాలకు వ్యతిరేకంగాను, ఆయన ప్రభుత్వం కోవిడ్ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోకపోవడాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రమైన ప్రజాగ్రహం వెల్లువెత్తింది. అయితే, అవినీతి కుంభకోణాల

విచారణను తప్పించుకోవడానికి ఆయన పన్నాగాలు పన్నుతున్నాడు. 2021 మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి.

**పశ్చిమ ఆసియా :** 2020లో అమెరికా మధ్యవర్తిత్వంతో కొన్ని అరబ్/ఆఫ్రికా దేశాలకు, ఇజ్రాయల్‌కు మధ్య కుదిరిన ఒప్పందాల ఫలితంగా యుఏఇ, బాహెరిన్, సూడాన్, మరోకో (ఆఫ్రికాలో)లతో దౌత్య, ఆర్థిక సంబంధాలు ఏర్పడ్డాయి. అరబ్బు ప్రపంచంలో వివిధ దేశాల మిత్రకూటముల్లో మార్పులు సంభవించాయి. అమెరికా ప్రయత్నాలకు లొంగని దేశాలపై కొత్త ఆంక్షలు విధించబడుతున్నాయి. ఇది తాజాగా సిరియా పెట్రో ఉత్పత్తులపై ఆంక్షలు విధించడంలో కనిపించింది. ఇది తీవ్రమైన ఇంధన కొరతలకు దారితీసింది. ప్రజలకు ఇంధన సరఫరాపై 24 శాతం కోత విధించబడింది. ఇప్పటికే కోవిడ్ మహమ్మారి మూలంగాను, ఆర్థిక సంక్షోభం మూలంగాను అధ్వాన్నమయిన ప్రజల పరిస్థితులను ఇది మరింత అధ్వాన్నం చేసింది.

**ప్రపంచ వ్యాపితంగా నిరసనలు :** గత కేంద్ర కమిటీ సమావేశం గుర్తించినట్లు, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నయా–ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తున్నది. ఆర్థిక సంక్షోభ ప్రభావం నుండి బయటపడటానికి ఎలాంటి పరిష్కారాలు చూపనప్పటికీ, లాభాలను మరింత గరిష్టం చేసుకునేందుకు ఈ చర్యలకు పాల్పడుతున్నది. ఇది ఆర్థిక అసమానతలను మరింతగా పెంచుతున్నది, కార్మికవర్గానికి వ్యతిరేకంగా వర్గ దాడిని మరింత తీవ్రం చేసింది. దీనికి వ్యతిరేకంగా అనేక దేశాలలో నిరసనలు మొదలవుతున్నాయి.

గ్రీస్‌లో ట్రేడ్ యూనియన్లు పనిగంటలు పెంచడానికి, సెలవులు రద్దు చేయడానికి, సామాజిక భద్రతను ప్రైవేటీకరించడానికి, ఇన్స్యూరెన్స్ రహిత, చెల్లింపులు లేని పనికి వ్యతిరేకంగా సమ్మె నిర్వహించాయి. పాలిటెక్నిక్ తిరుగుబాటు వార్షికోత్సవ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) నాయకత్వంలో నిర్వహించిన ప్రదర్శనపై పోలీసులు దాడి చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు పార్టీ నేతలు, పార్లమెంటు సభ్యులు ఈ దాడిలో గాయపడ్డారు.

**ఫ్రాన్స్‌లో పారిస్‌లో**ను, ఇంకా పలు నగరాల్లోను ప్రతిపాదిత నూతన భద్రతా చట్టాలకు వ్యతిరేకంగా గత నవంబరు, డిసెంబరు మాసాల్లో నిరసనలు జరిగాయి. ఈ చట్టాలు ప్రజలపై నిఘాను పెంచుతాయి. పోలీసు అధికారుల చిత్రాలను మీడియాలో ప్రచారం చేయడాన్ని నిషేధిస్తాయి. అయితే, ప్రభుత్వం వెనక్కి తగ్గక తప్పలేదు. ఈ చట్టాల డ్రాఫ్టులను మళ్ళీ తయారు చేస్తానని ప్రకటించింది. ఈ నిరసన ప్రదర్శనలు చాలా ప్రాంతాలలో పోలీసుల క్రూరత్వానికి గురి కావల్సి వచ్చింది.

**జార్జియా** రాజధాని త్బిలిసిలో వేలాది ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. దేశంలో అతి పెద్ద ధనవంతుడు, మాజీ ప్రధాని అక్టోబర్ పార్లమెంటరీ ఎన్నికలను రిగ్గింగ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ, మళ్ళీ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రదర్శనలు జరిగాయి.

**థాయ్‌లాండ్**లో ప్రధాని ప్రయూత్ చాన్ ఓచా గద్దె దిగాలని, మరింత ప్రజాస్వామ్య భాగస్వామ్యం కోసం, రాచరికంపై న్యాయ, రాజకీయ, ఆర్థిక తనిఖీలను అమలు చేసేందుకు సంస్కరణల కోసం రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రదర్శనలు జరిగాయి.

**పెరు**లో వ్యవసాయ సంస్కరణలకు వ్యతిరేకంగాను, పెరు వ్యవసాయాన్ని బహుళజాతి ఆగ్రిబిజినెస్ సంస్థలకు అప్పగించేందుకు చేసిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగాను డిసెంబరులో పెద్దఎత్తున ప్రదర్శనలు జరిగాయి. వీటితో ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది.

**బ్రెగ్జిట్ – ఐరోపా యూనియన్(ఇయు) – బ్రిటన్ :** అనేక సంవత్సరాల జాప్యం, సంప్రదింపులు అనంతరం ఇయు, బ్రిటన్ బ్రెగ్జిట్ వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ఇయు సార్వభౌమత్వం నుండి స్వేచ్ఛనిస్తుంది కాని, బడా కార్పొరేట్ల నుండి మాత్రం స్వేచ్ఛను ఇవ్వడంలేదు. పెట్టుబడిదారీ స్వేచ్ఛామార్కెట్ నిబంధనలు, విధానాలు, డబ్ల్యుటివో నిబంధనలు, ఆధిపత్యాన్ని కొనసాగించడానికి, కొత్త యుకె – ఇయు మధ్యవర్తిత్వ యంత్రాంగం కోసం కొత్త చట్టాలను బ్రిటన్ తీసుకువస్తుంది.

**ఆర్ఇసిపి పై సంతకాలు :** చైనాతో సహా 15 ఆసియా ఖండ దేశాలు ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్ఇసిపి) పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంలో చైనాతో సన్నిహిత సంబంధాలు కలిగిన కంబోడియా లాంటి దేశాలు, చైనాతో అంతంత మాత్రం సంబంధాలు కలిగిన ఆస్ట్రేలియా, జపాన్ లాంటి దేశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన వాణిజ్య ప్రాంతాన్ని సృష్టిస్తుంది. చైనా, జపాన్, దక్షిణ కొరియా లాంటి ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కొన్ని ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఇది ఒక విశాలమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం. ఇది 30% ప్రపంచ జిడిపికి, జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాబోయే 20 సంవత్సరాలలో ఆర్ఇసిపి విస్తారంగా దిగుమతి సుంకాలను తొలగిస్తుందని భావిస్తున్నారు. మేథో ఆస్తి హక్కులు, టెలికమ్యూనికేషన్లు, ఫైనాన్స్ సంబంధిత సేవలు, ఇ–కామర్స్, ప్రొఫెషనల్ సేవలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. దేశీయ పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం ఉంటుందేమోనని భయపడుతూ భారతదేశం ఈ ఒప్పందంలో

చేరలేదు. మన పార్టీ ఇప్పటికే ఆర్‌ఇసిపి పట్ల వ్యతిరేక వైఖరి తీసుకున్నది.

**ఐరోపా యూనియన్– చైనా ఒప్పందం :** మార్కెట్ లభ్యత, పెట్టుబడుల భద్రతలకు వర్తించేందుకు వినియోగపడుతుందనే ఉద్దేశంతో ఇయు (ఐరోపా యూనియన్) – చైనాల మధ్య పెట్టుబడులపై సమగ్ర ఒప్పందం (సిఏఐ) కుదిరింది. అయితే అంగీకరించబడిన పెట్టుబడుల అంశం ఒక్కటే ఒప్పందం ప్రతిలో ఉంది. పెట్టుబడుల భద్రత అంశం భవిష్యత్ సంప్రదింపులకు వదిలివేయబడింది. సిఏఐ కోసం 2013లో సంప్రదింపులు మొదలయ్యాయి. 35 దఫాలు అవి జరిగాయి. ఈ ఒప్పందానికి చట్టపరమైన ప్రక్రియ కూడ ఉంది. ఆ చట్టం ఆమోదించబడి అమల్లోకి రావాలంటే ఇరు పక్షాలు ముందు సంతకాలు చేయాలి. దీనికి ఒక సంవత్సరం కాలం పడుతుంది. అదనంగా పెట్టుబడుల భద్రతపై సంప్రదింపులు ముగించడానికి రెండేళ్ళ గడువు పెట్టుకున్నారు.

ఈ ఒప్పందంపై సభ్య దేశాలలోను, ఐరోపా పార్లమెంటులోను వ్యతిరేకించే వారికి, అనుకూలించే వారికి మధ్య వివాదం తలెత్తింది. జర్మనీ, ఫ్రాన్స్‌లు మాత్రమే సభ్య దేశాల అధినేతలకు తెలియకుండానే గత ఏడాది చివరన ఈ ఒప్పందాన్ని ముందుకు నెట్టాయని పోలండ్, ఇటలీలు బహిరంగంగానే ఫిర్యాదు చేశాయి.

**నేపాల్ : పార్లమెంటు రద్దు :** ప్రధాని కెపి ఓలి పార్లమెంటును రద్దుచేసి, మళ్ళీ ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించడం పట్ల వేలాదిమంది నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని ఓలి అన్ని విషయాలలోను పార్టీని పట్టించుకోకుండా ముందుకు వెళుతున్నాడని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌సిపి) విమర్శించిన తర్వాత ఓలి ఈ పనికి పూనుకున్నాడు. పార్లమెంటు రద్దుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటిషన్లు కూడ వేయబడినాయి.

ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ ఇద్దరు సహాధ్యక్షుల్లో ఒకడిగా ఉన్న ఓలీని పార్టీ తొలగించింది. ప్రచండ మరొక సహాధ్యక్షుడు. కెపి ఓలి స్థానంలోకి మాధవ్ నేపాల్ తీసుకోబడ్డాడు. ఇప్పుడు ఓలీని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి కూడ బహిష్కరించింది. పార్టీ, ఎన్నికల చిహ్నం కూడ తమదంటే తమదంటూ ఇరు పక్షాలు ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్ళాయి. దీన్ని ఎన్నికల కమిషన్ ఇంకా పరిష్కరించలేదు. ప్రధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రధాని కూడ తనకు అనుకూలంగా కొద్దిమందితో అయినప్పటికీ ప్రదర్శనలు చేయిస్తున్నాడు.

పరిస్థితి అనిశ్చితంగా ఉంది. ఈ సమస్య మూలంగా నేపాల్ రిపబ్లిక్‌లో ప్రజాస్వామ్యానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఏర్పడవచ్చు. తొలగించబడిన రాచరికానికి విశ్వాసపాత్రులతో సహా మితవాద శక్తులు పరిస్థితిని

తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

## జాతీయ పరిస్థితి

**కోవిడ్ పరిస్థితి :**వ్యాక్సిన్ వచ్చిన తర్వాత ప్రధాని మోడీని ఆకాశానికెత్తేస్తూ బిజెపి పెద్ద ఎత్తున ప్రచారం మొదలెట్టింది. కోవిడ్ సంక్షోభాన్ని ఆయన ఎదుర్కొన్న తీరు ప్రపంచంలో అందరి కన్నా మిన్నగా ఉందని, టెస్టులు, లాక్‌డౌన్, తగినంత ఆరోగ్య సదుపాయాలను కల్పించడం గురించి ప్రత్యేకంగా పేర్కొంటూ ఈ ప్రచారం సాగింది.

ప్రపంచంలో అతి తక్కువ టెస్టులు చేసిన దేశాలలో భారత్ ఒకటని అందరికి తెలిసిందే. ఈ విషయం రుజువు చేయబడింది కూడా. అర్థంతరంగా, ప్రణాళికారహితంగా విధించిన లాక్‌డౌన్‌తో తలెత్తిన సమస్యల మూలంగా, వలస కార్మికులు సుదీర్ఘ ప్రయాణాలు చేయవలసి వచ్చింది. మోడీ ప్రభుత్వం వారికి కనీసం ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేయడానికి సైతం నిరాకరించింది. ఇది ఒక తీవ్రమైన మానవ విషాదం. దేశ విభజనానంతరం ఎన్నడూ ఇంత పెద్ద ఎత్తున ప్రయాణాలను చూడలేదు. ఇది వలస కార్మికులను వర్ణించవీలులేని కష్టాలకు గురిచేయడమే కాకుండా, కోవిడ్ వైరస్ దేశమంతటికీ విస్తరించడానికి కూడ దోహదకారి అయింది.

ఆరోగ్య కార్యకర్తలకు తగినంత సంఖ్యలో పిపిఇ లను సరఫరా చేయడం గురించి కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ సరైనరీతిలో పట్టించుకోలేదు. ప్రధాని పేరుతో ఒక ప్రైవేట్ ట్రస్టు నిధిని ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో డబ్బు పోగుచేశారు. దీన్ని ఆరోగ్య సదుపాయాలను కల్పించడానికి, ఆరోగ్య కార్యకర్తలకు రక్షణ పరికరాలు అందించడానికి వినియోగించలేదు. ఉద్యోగుల నుండి, ప్రభుత్వరంగ కార్మికుల నుండి ఒక రోజు వేతనం బలవంతంగా వసూలు చేయడానికి అత్యున్నత స్థాయి ప్రభుత్వ యంత్రాంగం వినియోగించబడింది. ప్రభుత్వరంగ సంస్థలు బలవంతంగా విరాళం అందించేట్లు చేశారు. కార్పొరేట్లకు మాత్రం పన్ను మినహాయింపులిచ్చి వాటి వద్ద ఉన్న సామాజిక బాధ్యతా నిధుల నుండి జమచేసేలా చేశారు. ఈ ట్రస్టు వ్యవహారాన్ని ప్రభుత్వం పారదర్శకంగా ఉంచలేదు, ఇది ప్రైవేటు ట్రస్టు నిధి అని చెబుతూ దానికి జవాబుదారీతనాన్ని నిరాకరించారు. ఇది ఏమాత్రం అంగీకరించ వీలులేనిది. ఈ నిధిని కాగ్ లాంటి ప్రభుత్వ సంస్థ చేత ఆడిట్ చేయించాలి. దీనికి నిరాకరించడం ప్రజాధనాన్ని లూటీ చేయడంతో సమానం.

విదేశాల నుండి వచ్చేవారందరిని స్క్రీనింగ్ టెస్టుకు గురిచేయడం అన్ని విమానాశ్రయాలలో 2020 మార్చిలో కానీ ఆరంభం కాలేదు. ప్రభుత్వం మాత్రం 2020 జనవరిలోనే స్క్రీనింగ్‌ను ప్రవేశపెట్టడంలో మోడీ చురుకుదనం కోవిడ్‌ను

సమర్థవంతంగా ఎదుర్కొనడానికి దోహదపడిందంటూ తప్పుడు ప్రచారాన్ని చేపట్టింది.

లాక్‌డౌన్ మూలంగా ఏర్పడిన ఇబ్బందుల వల్ల ప్రజలు బ్రతకడానికి పడ్డ కష్టాలు ఆర్థిక మాంద్యాన్ని మరింత తీవ్రం చేశాయి. పెద్ద ఎత్తున ఉద్యోగాలు కోల్పోవడం, అసంఘటిత రంగం పూర్తిగా ధ్వంసం కావడం కోట్లాది ప్రజలను ఆకలిబాధలకు గురిచేసింది, వారిని మరింత దరిద్రులుగా మార్చింది. ఆదాయపన్ను పరిధిలో లేనివారందరికీ నేరుగా నగదు బదిలీ చేయాలని, ప్రజలందరికీ ఉచితంగా ఆహారధాన్యాలను సరఫరా చేయాలని పార్టీ మొదటినుండీ డిమాండ్ చేస్తూ వచ్చింది. ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ దీన్ని అంగీకరించడం లేదు. దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాలలోను అలాంటి చర్యలు దాదాపు ఒక సంవత్సరం నుండి అమల్లో ఉన్నాయి. అమెరికాలో ఈ అంశాలతో కూడిన నూతన ఉద్దీపన ప్యాకేజీని అధ్యక్షునిగా ఎన్నికైన బైడెన్ తాను అధికార బాధ్యతలు స్వీకరించక ముందే ప్రకటించాడు.

వ్యాక్సిన్ల విషయానికొస్తే ఇప్పుడు వినియోగంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ తయారు చేసిన వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం కోసం బ్రిటన్ ప్రభుత్వం పూర్తి నిధులు అందించింది. వ్యాక్సిన్ తయారై, మూడు దశల టెస్టింగ్ పూర్తిచేసుకున్న తర్వాత వర్ధమాన దేశాలకు దాన్ని అందించాలన్న షరతు మీద ఈ నిధులను అందించింది. ఈ వ్యాక్సిన్‌నే భారత దేశం తయారుచేసిందని బిజెపి, ప్రధాని మోడీ చెప్పుకుంటున్నారు. స్వదేశీ వ్యాక్సిన్ అని గొప్పలు చెబుతున్నారు. భారత దేశం చేసిందల్లా ఆక్స్‌ఫర్డ్ నుండి లైసెన్సు తీసుకొని ఇక్కడ తయారుచేయడమే. దీనికోసం రాయల్టీ చెల్లిస్తున్నారా లేదా అన్న అంశాన్ని మాత్రం ప్రభుత్వం బయటకు చెప్పడం లేదు. మరో దేశీయ వ్యాక్సిన్ విషయంలో మాత్రం సమర్థత రుజువు కాలేదు. అనేక ఆరోగ్య సమస్యలు కూడ తలెత్తాయి. వ్యాక్సిన్ తీసుకోకుండా ప్రజలు నిరాకరించడానికి ఇది దారి తీస్తుంది. కోవిడ్ మహమ్మారి సమస్యను ఇది మరింత పెంచుతుంది.

ఎప్పటి లాగానే, ప్రభుత్వం ఇప్పుడు కూడ తప్పుడు ప్రచారంతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నది. కాని వాస్తవాన్ని మాత్రం ప్రజలు అనుభవంలో తెలుసుకుంటున్నారు.

## ఆర్థిక సంక్షోభం

ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకున్నదని మోడీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. కాని వాస్తవం మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఉంది. జిడిపి పతనం మరింత తీవ్రమవుతున్నది తప్ప పెరగడం లేదు. అధికారిక అంచనాల ప్రకారమే, 2019-20లో జిడిపి 4.2 శాతానికి పైగా పెరిగితే, 2020-21లో మైనస్ 7.7 శాతంగా ఉంది.

జిడిపిలో కొద్ది శాతానికి ప్రాతినిధ్యం వహించే వ్యవసాయ రంగం ఒక్కటే కొంత అభివృద్ధిని నమోదు చేసింది. పారిశ్రామిక రంగం మైనస్ 8.5%, జిడిపిలో అధిక శాతానికి ప్రాతినిధ్యం వహించే సర్వీసు రంగం మైనస్ 9.2% పతనం చెందాయి. పారిశ్రామిక రంగంలో కూడ మాన్యుఫాక్చరింగ్ విభాగం మైనస్ 9.5 శాతానికి తగ్గిపోయింది. ఈ మాన్యుఫాక్యర్‌లోనే అధిక స్థాయిలో ఉద్యోగ కల్పన జరిగేది.

మొదటి త్రైమాసికలో మైనస్ 23.9 శాతం, రెండవ త్రైమాసికంలో అది 7.51 శాతం పతనం కొనసాగడంతో మొత్తం ఆర్థిక సంవత్సరానికి వేసిన అంచనాలు మరింత తగ్గుతాయి. ఆర్థిక పతనం మరింత తీవ్రమై పరిస్థితి ఇంకా అధ్వాన్న మవుతుంది.

**వ్యయం తగ్గుదల ఆందోళన కలిగించే ధోరణి:** వ్యయ అంచనాలు ఆందోళన కలిగించే రీతిలో తగ్గిపోయాయి. దీనితో ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం చాలా ఆలస్యం అవుతుంది, మరింత కష్టతరమవుతుంది. వ్యక్తిగత ఆర్థిక వినియోగ వ్యయం, 2019-20లో ప్లస్ 5.3 శాతం ఉంటే, 2020-21లో మైనస్ 9.5 శాతానికి క్షీణిస్తుందని అంచనా. స్థూల స్థిర పెట్టుబడి కల్పన ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాల పటిష్టతకు ఎంతో ముఖ్యమైన సూచిక. ఇది మైనస్ 14.5 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల ధోరణి 2017 నుండి 2020 వరకు కూడ కనిపించింది. ప్లస్ 8.5 శాతం నుండి మైనస్ 2.8 శాతానికి దిగజారింది. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

పైన పేర్కొన్న ప్రైవేటు వినియోగ వ్యయం, స్థూల స్థిర పెట్టుబడి కల్పన రెండూ కలిసి జిడిపిలో 87 నుండి 89శాతం వరకూ ఉంటాయి. ఈ రెండు సూచికలు ఇంతగా పడిపోవడం ఆర్థిక వ్యవస్థకు సంబంధించి చెడువార్త.

ప్రభుత్వ స్థూల వ్యయం 2020-21 రెండో త్రైమాసికంలో మొదటి త్రైమాసికంలో కన్నా 25 శాతం తగ్గింది. రెండో త్రైమాసికం జులై నుండి మొదలవుతుంది. అంటే లాక్‌డౌన్ మొదలయిన ఒక నెలకన్నమాట. గత సిసి నివేదికలో పేర్కొన్నట్లు ప్రభుత్వం ఎంతో పూదరగొట్టుకున్న 'ఆత్మనిర్భర్' ఆర్థిక ఉద్దీపన ప్రభుత్వ వ్యయం మూలంగా కాదని, పరపతి సదుపాయాలను వినియోగించుకోవడం వల్లనే అన్నది ఈ అంకెలను బట్టి రుజువవుతున్నది.

ఈ మూడు సూచికలను కలిపి చూస్తే, స్వల్పకాలంలో ఆర్థిక వ్యవస్థ మళ్ళీ అభివృద్ధి మార్గంలోకి రావడం సాధ్యమయ్యేది కాదని అర్థమవుతుంది. ఆర్థిక వ్యవస్థ పెరుగుదల ఇప్పటికే మొదలైందని ప్రభుత్వం చెప్పే మాటలు బూటకం అని తేలుతుంది.

దేశ ప్రజల కొనుగోలుశక్తి దారుణంగా పడిపోవడం వల్ల, దేశీయ గిరాకీ

విపరీతంగా పడిపోవడమే భారత ఆర్థికవ్యవస్థ సంక్షోభానికి ప్రధాన కారణం. ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేయాలని, ఉచితంగా ఆహారధాన్యాలు పంపిణీ చేయాలని మహమ్మారి ప్రారంభమైన దగ్గర నుండి పార్టీ డిమాండు చేస్తున్నా, ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. అలా చేసినట్లయితే, దేశీయ గిరాకీ పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం తేలికయ్యేది, ఇప్పుడు ప్రజలనుభవిస్తున్న ఆర్థిక బాధల నుండి బయటపడేవారు. ఇది రెండు రకాలుగా ప్రజలకు, ఆర్థికవ్యవస్థకు కూడ ఉపయోగపడేది.

స్వావలంబన సాధన పేరుతో గొప్పగా చెప్పుకుంటున్న ఆర్థిక ఉద్దీపన ప్యాకేజి సైతం పైన గమనించినట్లు ఎలాంటి ఫలితమూ ఇవ్వలేదు. వ్యయం భారీగా తగ్గిపోవడం దేశీయ గిరాకీని మరింతగా తగ్గించి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం ఇంకా తీవ్రం కావడానికి దోహదపడింది. ద్రవ్యపరంగా ప్రభుత్వం పెద్దఎత్తున జోక్యం చేసుకొని, తన వ్యయాన్ని పెంచకపోయినట్లయితే ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం అసాధ్యం. కరోనా మహమ్మారి ఆరంభం కాకముందే, ఆర్థిక వ్యవస్థ పతనం దిశగా కదులు తున్నప్పుడే పార్టీ డిమాండ్ చేసినట్లు, ఎంతగానో అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెద్ద ఎత్తున పెంచినట్లైతే, భారీ స్థాయిలో ఉపాధి కల్పన జరిగేది.

అలా కొత్తగా ఉపాధి పొందిన వారి వ్యయం మూలంగా దేశీయ గిరాకీ బాగా పెరిగి ఆర్థిక కలాపాలు తిరిగి పుంజుకొని మూతపడిన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు తిరిగి ప్రారంభమయ్యేవి. కానీ, ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం నయా-ఉదారవాద విధానాలను ముందుకు తీసుకువెళ్ళి, ప్రైవేటు పెట్టుబడులకు గరిష్ట లాభాలను కట్టబెట్టేందుకు ఆరాటపడుతూ మన సలహాను పెడచెవిన పెట్టారు. ఇది ప్రజల ఆదాయాలను మరింతగా తగ్గించి, వారి కొనుగోలు శక్తి ఇంకా తగ్గిపోవడానికి కారణమైంది.

ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు ఏకైక మార్గం ప్రభుత్వ వ్యయాన్ని పెద్ద ఎత్తున పెంచడమే. ఇప్పటి సూచనలను గమనించినట్లైతే, రాబోయే బడ్జెట్ మరోసారి గారడీ లాగా ఉంటుంది తప్ప, ప్రభుత్వ వ్యయంలో చెప్పుకోదగ్గ పెరుగు దలేమీ ఉండదు. ఫలితంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

**అసమానతలు**

మహమ్మారి కాలంలోను, లాక్‌డౌన్ లోను ప్రైవేటు లాభాలను పెంచడానికి నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసిన ఫలితంగా భారతదేశంలోను, అలాగే ప్రపంచంలోను అసమానతలు దారుణంగా పెరిగిపోయాయి.

ఇటీవలి ఆక్స్‌ఫాం నివేదిక "అసమానతల వైరస్" అనే శీర్షికతో వెలువడింది. మహమ్మారి కాలంలో భారత దేశంలోను, ప్రపంచంలోను అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయని ఈ నివేదిక పేర్కొంది. లాక్‌డౌన్ కాలంలో భారత దేశంలోని శతకోటీశ్వరుల సంపద 35 శాతం పెరిగింది. ఈ కాలంలో భారత దేశంలోని మొదటి 100 మంది శతకోటీశ్వరుల సంపద దాదాపు రు. 13 లక్షల కోట్లు పెరిగింది. దీనికి పూర్తి భిన్నంగా లాక్‌డౌన్ కాలంలో 12.5 కోట్ల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. 2020 ఏప్రిల్‌లో గంటకు 1,70,000 మంది చొప్పున నిరుద్యోగులయ్యారు.

ఇదే కాలంలో 11మంది అతి పెద్ద శత కోటీశ్వరుల పెరిగిన సంపద 10 ఏళ్ళ పాటు గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగించడానికి సరిపోతుంది. పదేళ్ళ ఆరోగ్య శాఖ బడ్జెట్‌తో అది సమానం. ఈ సమయంలోనే, నిరుద్యోగం, ఆకలి, పౌష్టికాహార లోపం, దారిద్ర్యంలోకి నెట్టివేయడం దుర్భరంగా పెరిగి పోయాయి.

## మరింత దుర్భరమవుతున్న ప్రజల పరిస్థితి

**నిరుద్యోగం :** నిరుద్యోగాన్ని సిఎంఐఇ సాధారణంగా తక్కువగా అంచనా వేస్తుంది. అలాంటి సంస్థ అంచనాల ప్రకారమే ఈ కాలంలో సంఘటిత రంగంలో 1.47 కోట్ల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. వీరిలో 95 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు. ఇలా ఉద్యోగాలు కోల్పోయినవారు మొత్తం ఉద్యోగుల్లో 13 శాతం ఉంటారు. ఇలా విద్యాధిక యువకులు నిరుద్యోగులుగా మారడం భారతదేశ భవిష్యత్తు ఎంత దారుణంగా ఉండబోతున్నదనేదానికి ఒక సూచిక. ప్రపంచంలోనే మన దేశంలో యువత అధిక శాతం ఉన్నారని ఒకవైపున గొప్పగా చెప్పుకుంటూ, ఆ సానుకూల అంశాన్ని ఇలా వృధా చేస్తున్నారు.

మొత్తం ఉద్యోగుల్లో నెలవారీ జీతాలు పొందే ఉద్యోగులు 31% ఉంటారు. వీరిలో 71% మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు.

దాదాపు పూర్తిగా ధ్వంసమైన అసంఘటిత రంగం, చిన్న తరహా పరిశ్రమల రంగంలో ఉపాధి కోల్పోయిన వారు పైన పేర్కొన్న వారికి అదనం. ఈ రంగంలో కోట్లాది మంది తమ ఉపాధిని కోల్పోయారు. గత కేంద్ర కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు, ఉత్పత్తి రంగంలో శ్రామిక శక్తి పాల్గొనడం తీవ్రంగా పడిపోయింది. వీరిలో అధిక శాతం స్వయం ఉపాధి వైపు మళ్ళుతున్నారు. ఉద్యోగాలు లేవు కాబట్టి వారు ఉద్యోగాల కోసం ప్రయత్నించకుండా, స్వంతంగా బ్రతుకు తెరువు చూసుకుంటున్నారు.

ఫలితంగా 2015 ప్రాతిపదికగా (100) ఉన్న వినియోగదారీ సెంటిమెంట్ సూచిక 2020 డిసెంబరు నాటికి 52.7 శాతానికి తగ్గిపోయింది. ఈ సెంటిమెంట్‌లో

ఏమన్నా సానుకూల ధోరణి మొదలైందా అని సర్వే చేయగా, అతి కొద్దిమంది సానుకూల మార్పు ఉంటుందని ఆశిస్తుండగా, అత్యధికులు మాత్రం నిరాశనే వ్యక్తం చేశారు.

**దారుణంగా పెరిగిపోతున్న ధరలు:** ఒకవైపున ఆర్థిక సంక్షోభం, ఉపాధి కోల్పోవడంతో పాటు, అన్ని నిత్యావసర సరుకుల, ప్రత్యేకించి పెట్రోలియం ఉత్పత్తుల ధరలు దారుణంగా పెరగడం ప్రజలనుభవిస్తున్న దుర్భర పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నది. నేడు పెట్రోలు, డీజల్, వంటగ్యాసు ధరలు అసాధారణ స్థాయిలో పెరిగాయి. 2020 ఏప్రిల్, నవంబర్ మధ్య కాలంలో ఎక్సైజ్ సుంకం వసూళ్ళు 2019 అదే కాలంలో కన్నా రు.63,000 కోట్లు అధికంగా వసూలు అయ్యాయి. ముడి చమురు అంతర్జాతీయ ధర 2013లో 109 డాలర్లు ఉంటే, 2021 నాటికి అది 53 డాలర్లుకు తగ్గింది. ఇదే సమయంలో ఆర్థిక సంక్షోభం మూలంగా ముడి చమురు దిగుమతులు కూడ తగ్గాయి. అయినప్పటికీ పెట్రోలియం ఉత్పత్తుల ధరలు చాలా దారుణంగా పెరుగుతున్నాయి. ఇంధన ధరలు ఇంతగా పెరగడంవల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇది ద్రవ్యోల్బణం మరింత పెరగడానికి దారితీసింది. ఆహార ధరలు కూడ పెరిగి, ప్రజల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత స్థాయిలో నేడు భారత దేశంలో పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు విధిస్తున్నారు.

ఇదే సమయంలో ప్రజలు తమ జీవితమంతా కూడబెట్టుకొని, బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకున్న మొత్తాలను మోడీ తమ ఆశ్రిత పెట్టుబడిదారులు లూటీ చేసుకోవడానికి అనుమతించారు. మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ అస్థిరమయ్యేందుకు దారితీసే విధంగా, ఈ పెట్టుబడిదారుల రు. 9 లక్షల కోట్ల రుణాలను రద్దుచేశాడు.

**పెరుగుతున్న ఆకలి బాధ**: భారత దేశ ప్రజల్లో పౌష్టికాహార లోపం మరింత పెరిగిపోయిందని, ప్రత్యేకించి బాలల్లో ఆందోళనకర స్థాయికి చేరిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక ధృవీకరించింది. ప్రపంచ ఆకలి సూచీ ఇప్పటికే ప్రపంచంలోనే ఆకలితో బాధపడేవారు భారతదేశంలోనే అత్యధికంగా ఉన్నారని చెప్పింది. భారత దేశంలోని పిల్లల్లో 80 శాతం మంది రక్త హీనతతో ఉన్నారని, పెరుగుదల లేమి, బలహీనమైన పిల్లల రేటు భారత దేశంలోనే ఎక్కువ అని ఆ సూచీ పేర్కొంది. భారత దేశపు భవిష్యత్తు ఈ విధంగా కృశింపజేయబడుతున్నది.

**బిజెపి/ఆర్ఎస్ఎస్‌లు తమ అసలు ఎజెండాను కొనసాగిస్తున్నాయి :** గతంలో కేంద్రకమిటీ గమనించినట్లు, ప్రస్తుత కోవిడ్ మహమ్మారి పరిస్థితిని కాని, ప్రజల బాధలు మరింత పెరగడాన్ని కాని, కేంద్రప్రభుత్వం, బిజెపి, ఆరెస్సెస్‌లు

తమ భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని మార్చడం, జాతీయ సంపదను కొల్లగొట్టడం అనే తమ అసలు ఎజెండాను అవిశ్రాంతంగా కొనసాగిస్తూనే ఉన్నాయి.

**నయా-ఉదారవాదం**: ప్రైవేటీకరణ దూకుడు నిరంతరాయంగా కొన సాగుతున్నది. ఈ ప్రైవేటీకరణకు అడ్డుపడతారేమోనన్న భయంతో ప్రభుత్వరంగ సంస్థల్లోని రెగ్యులర్ కార్మికులను తొలగించి, కాంట్రాక్టు కార్మికులను నియమిస్తున్నారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్న అన్ని కార్మిక చట్టాలను రద్దుచేసి, తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు రూల్సు తయారీని ముగించి, అతి త్వరలో అమలుకు ప్రభుత్వం సిద్ధం చేస్తున్నది.

కొత్తగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాల ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి ప్రభుత్వం కట్టబెడుతున్నది. ఈ చట్టాలను రద్దుచేయాలని రైతాంగం చారిత్రాత్మకంగా నిర్వహిస్తున్న బ్రహ్మాండమైన నిరసనను పట్టించుకోకుండా మొండిగా వ్యతిరేకిస్తున్నది. భారత ఆర్థిక వ్యవస్థ మీద, సహజవనరుల మీద, జాతి సంపద మీద అదుపును దేశ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ఎంత గట్టి పట్టుదలతో ఉన్నదో ఈ అంశాలు రుజువు చేస్తున్నాయి.

**రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడం**: గతంలో కేంద్ర కమిటీ గమనించినట్లు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడం, స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేయడం అనే ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం అవిశ్రాంతంగా ముందుకు సాగుతున్నది. తమ మతోన్మాద హిందూత్వ మద్దతు పునాదిని పటిష్టపరుచుకునేందుకు మతపరమైన విభజనను మరింత తీవ్రం చేయడం, భారత రిపబ్లిక్ స్వభావాన్ని మార్చివేయడం అనే వారి మరో లక్ష్యం కూడ వీటికి జతగా ముందుకు తీసుకుపోబడుతున్నది.

రాజ్యాన్ని లౌకిక, ప్రజాతంత్ర రాజ్యాంగం ఆధారంగా నడపడానికి, మతం ప్రాతిపదికన నడపడానికి మధ్య వ్యత్యాసం త్వరితగతిన మసకబారేలా చేయబడు తున్నది. లౌకికతత్వం చాల సంవత్సరాల క్రితమే పల్చన చేయబడింది. లౌకికతత్వం అంటే రాజ్యాన్ని, మతంతో సంబంధం లేకుండా నిర్వహించడం అనే దాన్నుండి, అన్ని మతాలను సమదృష్టితో చూడటంగా మార్చబడింది. ఇప్పుడు దాన్ని కూడ వదిలేశారు.

యుపి ప్రభుత్వ నాయకత్వంలో, మధ్య ప్రదేశ్, ఇంకా ఇతర బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు "లవ్ జిహాద్" అంటే భిన్న మతాలకు చెందినవారి మధ్య వివాహాలను (ప్రత్యేకించి హిందూ మతానికి చెందిన అమ్మాయిలను, ముస్లిం యువకులు వివాహం చేసుకోవడాన్ని) నిషేధించడానికి చట్టాలు తీసుకువచ్చాయి. అలా వివాహం చేసుకున్న జంటలపై వేధింపులు, అరెస్టులు, జైలు నిర్బంధాలు సాగుతున్నాయి. ఇది భారత రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి. యుక్తవయస్కులైన యువతీయువకులు పరస్పరం ఇష్టపడి

కుల, మతాలతో నిమిత్తం లేకుండా వివాహం చేసుకోవడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. ఈ రాజ్యాంగహక్కుకు రక్షణ లేకుండా పోయింది. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను, భారత న్యాయవ్యవస్థకు నూతన అవతారంగా మారిన సుప్రీం కోర్టు తనంత తానుగా రద్దుచేయవచ్చు. కాని అలాంటి సుప్రీం కోర్టు ఈ చట్టం పట్ల మౌనం వహిస్తున్నది. అయినప్పటికీ, పరస్పరం ఇష్టపడిన వారు తాము ఎవరితో జీవితం గడపాలో నిర్ణయించుకోవడం వారి వ్యక్తిగత ఇష్టమని, ఆ హక్కు తొలగించలేనిదని అలహాబాద్ హైకోర్టు రూలింగ్ ఇచ్చింది.

అంతే కాకుండా, అనేక బిజెపి పాలిత రాష్ట్రాలలో గోరక్షణ చట్టాలు కూడ మత విభజన లక్ష్యంగా తీసుకురాబడుతున్నాయి. అయోధ్యలో ఆలయనిర్మాణం పేరుతో, బిజెపి, దాని సహ సంస్థలు దేశవ్యాపితంగా పెద్దఎత్తున నిధుల వసూళ్ళను దూకుడుగా ప్రారంభించాయి. ఈ కార్యక్రమం కూడా మత విభజన మరింత తీవ్రం చేయడానికి ఉద్దేశించబడింది. కొన్ని సందర్భాలలో ఉద్రిక్తతలు పెరగడం, ఘర్షణలకు దారితీయడం, కొందరు మరణించడం కూడ సంభవించింది. మైనారిటీ మతస్థుల వద్ద నుండి బలవంతంగా నిధులు వసూలు చేస్తున్నారు. అలా ఇవ్వడానికి నిరాకరించిన వారిపై దాడులు జరుగుతున్నాయి.

**మత ఉద్రిక్తతలను పెంచడం :** అయోధ్యలో నిర్మించబోయే రామమందిరానికి నిధులు సేకరించే పేరుతో ఆర్ఎస్ఎస్ సంస్థలు మధ్యప్రదేశ్‌లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మైనారిటీ ప్రాంతాలలోకి ప్రవేశించి మసీదులను లక్ష్యం చేసుకొని హింసను ప్రేరేపించాలని వారు ప్రయత్నిస్తున్నారు. ఉజ్జయిని, మందసూర్, ఇండోర్ ఇతర ప్రాంతాలలో దాడులు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఈ నిధుల సేకరణను బిజెపి ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారు.

**ఒకే జాతి, ఒకే ఎన్నిక :** బిజెపి యొక్క ఈ లక్ష్యాన్ని మళ్ళీ లేవనెత్తుతున్నారు. మనం గతంలో నిర్ధారించినట్లుగా ఇది పూర్తిగా అప్రజాస్వామికం. మన రాజ్యాంగంలో నిర్వచించబడ్డ భారత రిపబ్లిక్ సమాఖ్య స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధం. ఇది భారత రాజ్యాంగంపై దాడి. పార్లమెంటు ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికలతో జత చేస్తే అది ఖర్చును తగ్గిస్తుందని, అలాగే అభివృద్ధిపై దృష్టి పెట్టడానికి అవకాశాలుంటాయని చెప్తున్నారు. రాజకీయ వ్యవస్థ యొక్క స్వభావాన్ని మార్చివేసి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలనను తీసుకరావడానికి బిజెపి చేస్తున్న మార్పులివి. భారత రాజ్యాంగ ప్రకారం ఈ రకమైన మార్పులు ఎట్టి పరిస్థితులలోను ఆమోద యోగ్యమైనవి కావు.

**మహిళలు, దళితులు, గిరిజనులు, అట్టడుగు వర్గాలపై పెరుగుతున్న హింస :** మహిళలపై జరిగిన భయానక లైంగిక దాడుల గురించి గతంలో జరిగిన సమావేశాలలో చర్చించాం. సమీక్షా కాలంలో ఇది మరింత పెరిగింది. బిజెపి పాలిత ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో మహిళలు, మైనర్ బాలికల గ్యాంగ్ రేప్‌లు, హత్యలు జరుగుతున్నాయి. నేరస్తులను పట్టుకుని వాళ్ళకు కఠినమైన శిక్షలు అమలు జరిపేందుకు చర్యలు తీసుకోవాల్సిన బిజెపి ముఖ్యమంత్రులు, మహిళల కదలికలపై పోలీస్ నిఘాని పెంచే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు అయిన వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రైవసీకి భంగం కలిగిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ఈ మార్గంలో నడుస్తున్నది.

ఈ వైఖరి నేరస్తులకు ప్రోత్సాహమిచ్చి ఇలాంటి దాడులు జరపాలని వారికి సంకేతాలు ఇచ్చినట్టే ఉంది. అలాగే దళితులు ఇతర బలహీనవర్గాలపై దాడులు మనువాదానికి సంబంధించిన సాంఘిక వ్యవస్థను ఏర్పర్చడానికి చేస్తున్న ప్రణాళికలో భాగమే. భారత రాజ్యాంగం ప్రకారం ఏర్పాటు చేసుకున్న ఆధునిక పౌర సమాజానికి ఇది భంగపాటే.

**న్యాయ వ్యవస్థ :** జమ్ము-కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్గించే ఆర్టికల్ 370 మరియు 35 ఏ, పౌరసత్వ సవరణ చట్టం, ఎలక్టోరల్ బాండ్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు సంవత్సర కాలానికి పైగా ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న న్యాయవాదులపై కోర్టు ధిక్కారణ కేసులు, అలాగే ప్రభుత్వ అనుకూల జర్నలిస్టుల బెయిల్ పిటీషన్లు వినడానికి కోర్టుకు సమయం ఉంటుంది. కానీ, ఆర్టికల్ 370 పై విచారణను వాయిదా వేస్తున్నది. తద్వారా ఆర్టికల్ రద్దును అమలు చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చినట్లే అవుతుంది. భారత రాజ్యంగం ప్రకారం న్యాయ వ్యవస్థకి ఉన్న స్వతంత్రతను ఇది దెబ్బతీస్తున్నది.

రాజ్యంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవరిస్తున్నది. మన పార్టీ అభ్యంతరం చెప్పినా కోవిడ్ మహమ్మారి పేరుతో బీహార్ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్స్‌కు, అలాగే వారికి అనుకూలంగా ఉండే ప్రవాస భారతీయులకు ఓటు వేయడానికి అనుమతించారు. స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలను నిర్వహించే, అలాగే పోటీ చేస్తున్న పార్టీలన్నింటికీ సమాన అవకాశాలు ఇచ్చే సామర్థ్యాన్ని ఎలక్షన్ కమిషన్ కోల్పోతున్నది.

**పౌర మరియు ప్రజాస్వామ్య హక్కులపై దాడి :** ప్రజాస్వామ్యం ఇంకా మానవహక్కులపై దాడులు పెరుగుతున్నాయి. ఎన్ఐఏను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని కట్టడి చేయడానికి ఉపయోగిస్తున్నారు. కళాకారులు, కమెడియన్లు,

మేధావులను లక్ష్యంగా చేసుకుంటూ వారి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు. ఎల్గార్ పరిషద్ కేసులో అరెస్ట్ చేసిన వారికి జైళ్ళలో కనీస వసతులైన మందులు, కళ్ళజోళ్లు, పుస్తకాలు, చెప్పులు లాంటివి కూడా ఇవ్వడం లేదు.

**భారత రిపబ్లిక్ యొక్క మారుతున్న స్వభావం :** మన గత కేంద్రకమిటీ సమావేశంలో చర్చించినట్లుగా భారత రాజ్యాంగంపై దాడులు, రాజ్యంగ అధికారాల్ని, వ్యవస్థలను కుదించడం కొత్త రాజకీయ నిర్వచనంలో భాగంగా మారింది. మారిపోతున్న భారత రిపబ్లిక్‌కు సంకేతాలుగా అయోధ్య రామమందిరం, ఢిల్లీ లోని సెంట్రల్ విస్టా మరియు కొత్త పార్లమెంటు భవనం నిలువనున్నాయి. నూతన పార్లమెంట్ భవన నిర్మాణం ఒక నెల వరకు ఆపివేసినా అనుకున్నట్లుగానే భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో, ప్రజల కష్టాలు పెరుగుతున్న సమయంలో ఆర్థిక వ్యవస్థ సంక్షుభితమైన సమయంలో ప్రజల సొమ్మును అనవసర విషయాలపై ఖర్చు పెడుతున్నారు. ఇది ప్రజలకు పూర్తిగా అన్యాయం చేస్తున్నట్లే. ఈ వనరులను ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తే బాగుండేది.

అయితే ఇవి మోడీ ఇండియా యొక్క చిహ్నాలు. కొత్త పార్లమెంటు భవనం 2022 వరకు అంటే స్వాతంత్ర్య దినోత్సవ 75వ వార్షికోత్సవం సందర్భంగా పూర్తవుతుంది. మందిర నిర్మాణం కూడా అదే సమయంలో పూర్తవుతుంది. 75 ఏళ్ల స్వాతంత్రం, 72 ఏళ్ల లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ సందర్భంగా భారత రిపబ్లిక్ యొక్క స్వభావాన్ని మార్చివేసే ప్రయత్నాలను బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. లౌకిక ప్రజాస్వామ్య భారత రిపబ్లిక్‌ను ఫాసిస్ట్ హిందూ రాష్ట్రంగా మార్చబోతున్నారు.

**మీడియా–టి ఆర్ పి రేటింగ్ ఏజన్సీల సంబంధాలు :** ఈమధ్య రిపబ్లిక్ టీవీ ఎడిటర్, టిఆర్‌పి రేటింగ్ ఏజన్సీల మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు బయటపడ్డాయి. ఇవి ఒక కేసుకు సంబంధించి ముంబై పోలీస్ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జ్ షీట్‌లో భాగం. రిపబ్లిక్ టీవి, రేటింగ్ ఏజన్సీల మధ్యనున్న అపవిత్ర బంధం గురించి ఇవి తెలియచేస్తున్నాయి. ఈ సంభాషణలు టిఆర్‌పి రేటింగులను తమకు అనుకూలంగా మార్చుకుని అడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా ఆదాయాన్ని సంపాదించుకోవడానికి చేసిన అవినీతి పద్ధతులు అని చెప్పాలి. జాతీయ భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు కూడా బయట పడ్డాయి. వీటిని కూలంకషంగా పార్లమెంటరీ యంత్రాంగం ద్వారా విచారించాలి. తప్పు చేసిన వారిని శిక్షించాలి.

కేంద్ర కమిటీ తన ఎన్నికల సమీక్షా నివేదికలో బిజెపి ప్రజల పోరాటాలు, సమస్యలను పక్కన పెట్టి పుల్వామాలో తీవ్రవాదుల దాడి, దానికి ప్రతిస్పందనగా బాలకోట్ చర్యలను కేంద్రంగా చేసుకొని ప్రజల దృష్టిని ఏ విధంగా ఒక మతోన్మాద,

యుద్ధోన్మాద జాతీయవాదంవైపు మరల్చగలిగిందో తెలిపింది. ఆర్టికల్ 370 రద్దు మరియు జమ్ము-కాశ్మీర్ రాష్ట్ర రద్దు గురించిన సమాచారం కూడా ముందే బయటపడింది. పాలక ప్రభుత్వం భారతీయ మీడియాని ప్రభావితం చేసి వారిని ఉపయోగించుకొని ప్రజాభిప్రాయాన్ని అబద్ధపు ప్రచారాలతో తనకు అనుకూలంగా ఎలా మల్చుకుంటున్నదో ఈ సంఘటన తెలియచేసింది. భారత రిపబ్లిక్ మారుతున్న స్వభావంతో పాటు ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియా (కొన్ని గౌరవప్రదమైన మినహాయింపులు తప్ప) బిజెపి / ఆర్ ఎస్ ఎస్ కు జేబు సంస్థలుగా దిగజారిపోయాయి.

**వాట్సాప్ :** వాట్సాప్ సొంతదారుడైన ఫేస్ బుక్ కొత్త ప్రైవసీ పాలసీని మూడు నెలల వరకు వాయిదా వేస్తున్నామని చెప్పినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛకు ఉన్న ప్రమాదం కొనసాగుతున్నది. సుప్రీంకోర్టు ప్రకారం వ్యక్తిగత గోప్యత అనేది ప్రాథమిక హక్కుల క్రిందికి వస్తుంది. వాట్సాప్ లో మారిన విధానం గోప్యతకు భంగం కల్గిస్తుంది. ఇతర దేశాలలో ఇలాంటి విధానాలు అమలు చేస్తామన్నప్పుడు ఆ దేశాల ప్రభుత్వాల నుంచే తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. కానీ, మన దేశంలో మారిన విధానం తమకు అనుకూలంగా ఉంటుందని భావించి బిజెపి ప్రభుత్వం దీనిని పెద్దగా వ్యతిరేకించటం లేదు. ఇది ఆమోద యోగ్యం కాదు. లక్షలాది మంది వాట్సాప్ నుంచి ప్రత్యామ్నాయ మేస్సేజింగ్ వేదికలకు తరలిపోతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రైవసీకి భంగం కలగకుండా చూడాలి లేదా ఫేస్ బుక్, వాట్సాప్, ఇంస్టాగ్రామ్ లను నిషేధించాలి.

ఫేస్ బుక్, వాట్సాప్‌లు ఇంటర్నెట్ పై వారి గుత్తాధిపత్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇలాంటి చర్యలు చేపడుతున్నారు. ప్రజలపై ఇలా గూఢచర్యం చేయడం చాలా ప్రమాదకరమైనది. వాట్సాప్-రిలయన్స్ భాగస్వామ్యం కూడా గుత్తాధిపత్యాన్ని పెంచి ప్రజలపై గూఢచర్యం చేయడానికి ఉపయోగపడి దుర్వినియోగమయ్యే ప్రమాదముంది.

## రాష్ట్రాల ఎన్నికలు

**బీహార్ :** బీహార్లో బి జె పి-జె డి(యు) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినా, సంకీర్ణానికి, మహా ఘట్‌బంధన్‌కు ఉన్న ఓట్ల తేడా కేవలం 0.3 శాతం మాత్రమే. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చినపుడు బిజెపి 12 శాతం ఓట్లను కోల్పోయింది. జేడీయూ గత ఎన్నికలలో 73 అసెంబ్లీ స్థానాలు గెలవగా ఈసారి 43 సీట్లు మాత్రమే సాధించుకోగల్గింది. గత ఎన్నికల తర్వాత ఆర్ జె డి తో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నితీష్ కుమార్ ఆర్జెడిని వదిలి బిజెపి కూటమిలో చేరి ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఈ ఎన్నికలలో ఓటర్లు దీన్ని పూర్తిగా తిరస్కరించారు.

వామపక్షాలు 29 సీట్లలో పోటీ చేసి 16 స్థానాలు గెలుచుకున్నాయి.

సిపిఐ(ఎంఎల్) 19 సీట్లు పోటీ చేసి 12 స్థానాల్లో గెలిచింది. సిపిఎం నాలుగు స్థానాలు పోటీచేసి రెండింటిని గెలుచుకోగా, సిపిఐ ఆరు స్థానాలు పోటీచేసి రెండింటిని గెలుచుకున్నది. మహా ఘట్ బంధన్ తన ప్రచారాన్ని ఆర్థిక సంక్షోభం అలాగే మహమ్మారిని కట్టడి చేయడంలో బిజెపి, దాని మిత్ర పక్షాల వైఫల్యాలు మరియు యువతలో పెరుగుతున్న నిరుద్యోగితలపై కేంద్రీకరించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. మతతత్వ ఎజెండాను లేవనెత్తి మత సమీకరణలు చేసే ప్రధాని మోడీ మరియు బిజెపి ప్రయత్నాలను ఇది చాలావరకు నిర్వీర్యపర్చింది. కౌంటింగ్ చివరిదశలో అవకతవకలు జరిగినట్లు నివేదికలు వచ్చాయి. ఎన్నికల కమిషన్ ఫిర్యాదులను స్వీకరించకుండా ఫలితాలను బిజెపికి అనుకూలంగా ప్రకటించింది.

వామపక్షాలు అసెంబ్లీలో తమకున్న బలాన్ని అణగారిన ప్రజల ప్రయోజనాల కొరకు అలాగే నిరుద్యోగం మరియు సాంఘిక ఆర్థిక అన్యాయాలను లేవనెత్తడానికి ఉపయోగించుకుంటామని ప్రకటించాయి.

**రానున్న ఎన్నికలు :** మత ధృవీకరణలను పెంచడానికి బిజెపి శతవిధాలా ప్రయత్నిస్తున్నది. తన అమ్ముల పొదిలోని అన్ని అస్త్రాలను బయటకు తీసి ముఖ్యంగా ధనబలంతో పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళలో గెలవడానికి బిజెపి ప్రయత్నిస్తున్నది.

కేంద్ర కమిటీ ఈ రాష్ట్రాలలో అమలు చేయాల్సిన ఎన్నికల ఎత్తుగడలను నిర్ణయించింది. పశ్చిమబెంగాల్లో కాంగ్రెస్‌పార్టీతో సీట్ల సర్దుబాటు గురించి లెఫ్ట్ ఫ్రంట్ మరియు కాంగ్రెస్‌ల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. అస్సాంలో కాంగ్రెస్, ఐ యు డి ఎఫ్, సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), కొత్త ప్రాంతీయ పార్టీల మధ్య అవగాహన కుదిరి ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించడం జరిగింది. తమిళనాడులో డిఎంకె నాయకత్వంలోని ఫ్రంట్ సీట్ల సర్దుబాటు గురించి చర్చలు మొదలు పెట్టాల్సి ఉంది. ఫ్రంట్‌లోని పార్టీలన్నీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఇంతకుముందు పేర్కొన్నట్లు కేరళలో కాంగ్రెస్(ఎమ్) చేరికతో మరింత విస్తరించిన ఎల్‌డిఎఫ్ ఈ ఎన్నికలలో యుడిఎఫ్, బిజెపిలకు వ్యతిరేకంగా పోటీ చేస్తుంది.

**కేరళను లక్ష్యంగా చేసుకున్న బీజేపీ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల వంటి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నది. ఎల్ డి ఎఫ్ ప్రభుత్వాన్ని కూల్చివేసే ఉద్దేశంతో సిపిఎం నాయకులను లక్ష్యంగా చేసుకొని కేంద్ర సంస్థ ఈ పని చేస్తున్నది. కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్, బిజెపి రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసి

ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి కలిసి పని చేస్తున్నాయి. సిపిఎం సభ్యులపై భౌతిక దాడులు మరియు హత్యలు జరుగుతున్నాయి.

త్రిపుర, పశ్చిమ బెంగాల్ లో పార్టీ కామ్రేడ్ లపై, కార్యాలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. బెంగాల్‌లో పార్టీ కార్యకర్తలపై టీఎంసీ , బిజెపి, అలాగే త్రిపురలో బిజెపి పార్టీ యొక్క అసాంఘిక శక్తులు తాజా దాడులు మొదలుపెట్టాయి.

**స్థానిక సంస్థల ఎన్నికలు – ఎల్‌డిఎఫ్‌కు ఘన విజయం :** మూడు అంచెలుగా ఉన్న పంచాయతీ ఎన్నికలలో ఎల్ డి ఎఫ్ ఘన విజయం సాధించింది. 6 కార్పొరేషన్‌లలో 5 స్థానాలను, 14 జిల్లా పంచాయితీలలో 11 స్థానాలను ఎల్ డి ఎఫ్ కైవసం చేసుకుంది. కేరళ ప్రజలు ఎల్ డి ఎఫ్ ప్రభుత్వ పనితీరును సమర్థిస్తూ ఎన్నికలలో తీర్పునిచ్చారు. 2018లో వచ్చిన వరదలు అలాగే కోవిడ్ మహమ్మారిని నిలవరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనిని ప్రజలు ప్రశంసించారు.

ఎల్డీఎఫ్ ప్రభుత్వం, నాయకులకు వ్యతిరేకంగా మితవాద మీడియా, సెంట్రల్ ఏజెన్సీల సహకారంతో కాంగ్రెస్ నాయకత్వంలోని యు డి ఎఫ్, బిజెపి చేసిన నిరాధార ఆరోపణలను ప్రజలు తిరస్కరించారు.

**ఇతర రాష్ట్రాలు**

స్థానిక సంస్థలకు తెలంగాణ, హైదరాబాద్ కార్పోరేషన్, రాజస్థాన్, జమ్ము కాశ్మీర్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎన్నికలు జరిగాయి. అన్ని రాష్ట్రాలలో మత సమీకరణాలతో కూడిన ఎన్నికల ప్రచారాన్ని బిజెపి చేపట్టింది. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి తన సీట్లను 4 నుంచి 48కి పెంచుకుంది. తెలంగాణ రాష్ట్ర సమితి ఘోరంగా దెబ్బతిన్నది.

జమ్మూకాశ్మీర్లో పీపుల్స్ అలయన్స్‌కి వ్యతిరేకంగా బిజెపి ప్రచారం చేసి వారిని జాతి విద్రోహులుగా పేర్కొన్నది. పీపుల్స్ అలయన్స్ అభ్యర్థులను స్వేచ్ఛగా ప్రచారం చేసుకోవడానికి వీలు లేకుండా ప్రభుత్వం అడ్డుకున్నది. మత సమీకరణాలతో పాటు బిజెపి నాయకత్వంలోని పాలకులు నియంతృత్వ వైఖరితో వ్యవహరించారు.

ఎన్ని ప్రయత్నాలు చేసినా పీపుల్స్ అలయన్స్ ఫర్ గుప్‌కార్ డిక్లరేషన్ 278 జిల్లాల్లో 110 స్థానాలలో విజయం సాధించింది. ఇందులో 84 కాశ్మీర్ డివిజన్‌కి సంబంధించినవి కాగా 26 జమ్ము డివిజన్‌కు సంబంధించినవి. బిజెపి 75 స్థానాలు గెలుచుకోగా అందులో 72 జమ్ముకు సంబంధించినవి. బిజెపి కాశ్మీర్లో మూడు సీట్లను మాత్రమే గెలుచుకుంది. కాంగ్రెస్‌కు 26 సీట్లు, జే కే అప్ని పార్టీకి 12 సీట్లు వచ్చాయి. 50 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. జమ్ము ప్రాంతంలో

కాశ్మీర్ కన్నా రెట్టింపు ఓట్లు పోలయ్యాయి. పీపుల్స్ అలయన్స్‌కు జమ్ము ప్రాంతంలో 26 సీట్లు వచ్చాయి.

రాజస్థాన్‌లో పాలక కాంగ్రెస్ పార్టీ గ్రామీణ ప్రాంతాలలో ఓడిపోయింది. పట్టణ ప్రాంతాలలో ఆధిక్యం సాధించింది. బిజెపి ఓటు షేర్ కూడా పంచాయతీ సమితిలలో 5.9 శాతం అలాగే జిల్లా పంచాయతీలలో 6.2 శాతం 2015 తో పోల్చినప్పుడు తగ్గింది.

కర్ణాటకలోని 30 జిల్లాల, 226 తాలూకాలలో 91,339 సీట్లు కలిగి ఉన్న 5728 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పార్టీ 20 జిల్లాల్లో 17 తాలూకాలలో, 250 గ్రామ పంచాయతీలలో 726 సీట్లలో పోటీ చేసింది. ఇందులో 231 స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచారు. 2015లో గెలిచిన 306 స్థానాలతో పోలిస్తే ఇది తక్కువ. కొన్ని జిల్లాల్లో మనం లాభపడ్డా చిక్కబల్లాపూర్ జిల్లాలో అధిక సంఖ్యలో సీట్లను కోల్పోయాం. శ్రీరామ్‌రెడ్డిని బహిష్కరించడంతో పార్టీలో వచ్చిన చీలికలు, రైవల్ అభ్యర్థులతో పోటీపడవలసి రావడంతో సీట్లు తగ్గాయి. పార్టీ పరంగా జిల్లాలో ఉన్న సమస్యలు కొనసాగుతున్నాయి.

జనవరి 2021లో హిమాచల్ ప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. మంచు కురుస్తున్న లాహౌల్. స్పీతి, చంబాలలో మాత్రం ఎన్నికలు జరగలేదు. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగలేదు. మన పార్టీ కామ్రేడ్స్ జిల్లా పరిషత్‌లో సభ్యులుగా 12 మంది, 25 మంది పంచాయతీ సమితి సభ్యులు, 28 మంది పంచాయతీ ప్రధాన్లు, 30 మంది వైస్ ప్రధాన్లుగా, 242 మంది వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు. గెలిచిన సీట్లు రాష్ట్ర వ్యాపితంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పార్టీ తన ప్రభావాన్ని పెంచుకోగల్గింది. గత ఎన్నికలలో గెలుపొందిన మన పార్టీ జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ సభ్యుల పనితీరు పార్టీ మీద ప్రజలకు విశ్వాసం పెరిగేటట్లు చేసి ఈసారి ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయి.

ఈ అన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర కమిటీలు మన ఫలితాలను గత ఎన్నికలతో పోల్చి సమీక్షించాలి. దానికనుగుణంగా మనం పాఠాలు నేర్చుకోవాలి.

**పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు :** అక్టోబర్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో మనం వ్యవసాయ చట్టాలకు, విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అలాగే ఈ చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో జరుగుతున్న రైతాంగ ఉద్యమానికి, నవంబర్ 26న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు పూర్తి మద్దతు అందించాల్సిందిగా పార్టీ అన్ని శాఖలకు పిలుపునిచ్చింది.

వ్యవసాయ చట్టాలు, లేబర్ కోడ్‌లు, పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణ,

ప్రభుత్వ ఆస్తుల లూటీ, పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా, అందరికీ విద్య, వైద్యం అందించాలన్న డిమాండ్లతో స్వతంత్ర కార్యాచరణను, ప్రచారాన్ని చేపట్టాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

అలాగే డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం, డిసెంబర్ 18 అంతర్జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఒక వారం పాటు మానవ హక్కులు, మైనారిటీ హక్కులపై ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చింది. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలని అలాగే ఉమ్మడి సమస్యలపై విశాల ఐక్య ఉద్యమాలు చేపట్టాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ విషయాలన్నిటిపై అలాగే ప్రజా ఉద్యమాలకు సౌహార్ద్రతను, మద్దతును ఇచ్చే శక్తులన్నిటితో కలిసి రాష్ట్రస్థాయి కూటమిని ఏర్పరచాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

కానీ, ఈ కాలంలో పార్టీ తన కార్యక్రమాలను ప్రధానంగా రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులపై కేంద్రీకరించింది. ఈసారి చాలా పెద్ద ఎత్తున రైతులు, కార్మికులు కలసి ఉద్యమించారు.

నవంబర్ 26-27 పిలుపును ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ ఇచ్చింది. ఈ పిలుపునకు స్పందించి పంజాబ్ మరియు హర్యానాలోని కిసాన్ సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ ఈ సంఘాలను కూడ తనలో చేర్చుకొని సంయుక్త కిసాన్ మోర్చాను ఏర్పర్చింది. ఎస్ కె ఏం నవంబర్ 5 న రాస్తారోకో పిలుపుతో పాటు అనేక అఖిలభారత స్థాయి నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.

సాధారణ సమ్మెకు నవంబర్ 26న కేంద్ర కార్మిక సంఘాలు పిలుపిచ్చాయి. ఈ సమ్మె విజయవంతమైంది. గతంలో కన్నా ఎక్కువ సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. దేశానికి సంపదను సృష్టించే 25 కోట్ల మంది కార్మికులు, కర్షకులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. అదే రోజున జరిగిన గ్రామీణ బంద్‌లో రైతులు వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు. చాలా రాష్ట్రాలలో బంద్ వాతావరణం కనిపించింది. సమ్మె పారిశ్రామిక, సేవా రంగాలపై ప్రభావం చూపించింది. చాలా రాష్ట్రాలలో ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలలో అణచివేతలు, బెదిరింపుల మధ్య సమ్మె పూర్తిగా విజయవంతమైంది.

మన ప్రజాసంఘాలన్నీ ముఖ్యంగా మహిళా, విద్యార్థి, యువజన, గిరిజన, దళిత మరియు వికలాంగుల వేదికలన్నీ ఈ పిలుపులకు పూర్తి మద్దతును ప్రకటించాయి.

**చలో ఢిల్లీ**

నవంబర్ 26 సార్వత్రిక సమ్మెకు మద్దతుగా అల్ ఇండియా కిసాన్ సంఘర్ష సమన్వయ కమిటీ గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చింది. దీని తర్వాత రైతులు ఢిల్లీ

వైపు కదలడం మొదలుపెట్టారు. ఢిల్లీ సరిహద్దుల చుట్టూ ముఖ్యంగా బిజెపి పాలిత ప్రాంతాలైన హర్యానా, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో భారీగా పోలీసులను మోహరించారు. రైతులను ఢిల్లీ రాకుండా అడ్డుకోవదమే వారి పని. రైతులు ముందుకు పోకుండా వాటర్ కానన్స్, లాఠీ చార్జ్, రోడ్ బ్లాకేడ్స్, రోడ్లపై గుంతలు తవ్వడం లాంటివి చేశారు.

వీటన్నింటినీ రైతులు వీరోచితంగా ఎదుర్కొని ఢిల్లీ సరిహద్దులకు చేరుకున్నారు. ఈ దశలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. చాలా పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో కేంద్ర ప్రభుత్వం రైతులు సమావేశం కావడానికి ఒక మైదానాన్ని ఇవ్వాల్సి వచ్చింది. ఎస్ కె ఏం దీనిని తిరస్కరించింది. బురారీలో రైతులకు ఇవ్వ చూపిన మైదానాన్ని ఒక బహిరంగ జైలుగా మార్చివేసే అవకాశముందని ఎస్ కె ఏం పేర్కొన్నది. జాతీయ రహదారుల బ్లాకేడ్‌ను కొనసాగించింది. ఇప్పుడు ఇది పెరుగుతున్న రైతుల సంఖ్యతో 60 రోజులుగా కొనసాగుతున్నది.

ఈ చట్టాల వల్ల లాభం పొందేది కార్పొరేట్ దిగ్గజాలైన అదానీ, అంబానీలు మాత్రమేనని రైతుల ఉద్యమం తెలియజేసింది. కార్పొరేట్ లాభాల కోసం భారతదేశ వ్యవసాయాన్ని, ఆహార భద్రతను కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టడాన్ని రైతు ఉద్యమం తిరస్కరించింది.

రైతు ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ఆర్ఎస్ఎస్ / బిజెపి విష పూరిత ప్రచారానికి పూనుకున్నాయి. రైతులను ఖలిస్తానులని, పాకిస్తానీయులని, మావో యిస్టులనీ, తుకడే తుకడే గ్యాంగ్ అనీ, ప్రతిపక్షాల వల్ల తప్పుదోవ పడుతున్నారని ప్రచారాలు చేసింది. కొంతమంది రైతు నాయకులని తీవ్రవాద ఖలిస్తానీ జాతి వ్యతిరేకులని చెప్పి ఏన్ ఐ ఏ తో విచారణ జరిపించడం ద్వారా రైతులను బెదిరించి జోక్యం చేసుకొనే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేసింది.

ఉద్యమంలో100 మంది కన్నా ఎక్కువ మంది రైతులు తీవ్రమైన చలి, ప్రమాదాలు, ఇతర కారణాల వల్ల మరణించారు.

**భారత్ బంద్ :** డిసెంబర్ 8 నాడు సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఇది పూర్తిగా విజయవంతమైంది. బంద్ పిలుపునకు కార్మిక ఉద్యమం మరియు మన ప్రజాసంఘాలు పూర్తి మద్దతు ఇచ్చాయి. దేశంలోని నగరాలు, గ్రామాలలో బంద్ విజయవంతంగా జరగడంతో సాధారణ జీవనంపై ప్రభావం చూపింది. చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బంద్‌కు మద్దతు ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్థలను, ప్రజారవాణా, పాక్షికంగా ప్రభుత్వ ఆఫీసులను మూసి వేసారు. ప్రజల నుంచి బంద్‌కు వచ్చిన మద్దతు ముందు ముందు

ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేసే అవకాశాలను తెలియజేస్తుంది.

దీంతో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలవాల్సిన తప్పనిసరి పరిస్థితి వచ్చింది. 11 దఫాలుగా చర్చలు జరిగాయి. చివరకు ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను ఒకటిన్నర సంవత్సరం వరకు అమలు చేయబోమని చెప్పింది. ఎస్ కే యం ఈ ప్రతిపాదనలను తిరస్కరించింది.

గెజిట్ అయిన చట్టాన్ని అమలు చేయకుండా ఆపడం సాధ్యం కాదని చట్టాలను రద్దు చేయాల్సిందేనని ఎస్ కే యం చెప్పింది. కనీస మద్దతు ధర కొనసాగుతుందని దానికి లిఖితపూర్వక హామీ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఎస్ కే యం కనీస మద్దతు ధర కొరకు చట్టం చేయాల్సిందని చెప్పింది. ఇప్పుడు కొన్ని పంటలకు మాత్రమే ఎంఎస్పి ఉందని అలాగే రైతులలో 6 శాతం మందికి మాత్రమే ఎం ఎస్ పి లభిస్తుందని కాబట్టి అన్ని పంటలకు, రైతులందరికీ ఎంఎస్పి ఇవ్వాలని ఎస్ కె ఎం డిమాండ్ చేసింది. కనీస మద్దతు ధర స్వామినాథన్ కమిటీ సిఫారసులకు (సి2+50 శాతం ఉత్పత్తిధరకు) అనుగుణంగా ఉండాలని రైతులు డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఎవరైనా కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరకి కొన్నట్లయితే వారిని శిక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగంలో పంటల సేకరణ నెట్వర్క్ బలోపేతం చెయ్యాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**అంతర్జాతీయ మద్దతు :** చారిత్రాత్మకమైన రైతుల పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి ముఖ్యంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా ల నుంచి మద్దతు లభించింది. పార్టీలకతీతంగా ఆయా దేశాల చట్టసభల సభ్యులు వారి వారి ప్రధాన మంత్రులకు లేఖలు రాసి ఈ విషయాన్ని భారత ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరారు.

కెనడా ప్రధానమంత్రి ఒక బహిరంగ ప్రకటన చేస్తూ ఈ విషయాన్ని పరిష్క రించాలని భారత దేశ ప్రధాని ప్రభుత్వాన్ని కోరారు. భారతీయ మూలాలు ఉన్న ప్రజలు ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు జరిపి రైతు ఉద్యమానికి మద్దతు తెలిపారు.

**సుప్రీంకోర్టు జోక్యం :** కొన్ని రైతు సంఘాలు వేసిన పిటిషన్ల ఆధారంగా సుప్రీంకోర్టును ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం కోరింది. వ్యవసాయ చట్టాల అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు నలుగురు సభ్యులున్న ఒక కమిటీని నియమించింది. కమిటీలోని సభ్యులు వ్యవసాయ చట్టాలకు అనుకూలంగా ఉన్నారు. అయితే, సభ్యులలో ఒకరు స్వచ్ఛందంగా కమిటీ నుంచి తప్పుకున్నారు. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు కమిటీని ఆదేశించింది. రైతులు

శాంతియుతంగా తమ నిరసనలను కొనసాగించుకోవచ్చని, రైతుల నిరసనలను నిషేధించకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

రిపబ్లిక్ డే పరేడ్‌కు తరలివస్తున్న రైతులను ఆపాలని ఢిల్లీ పోలీసు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. కోర్టు శాంతియుత నిరసనను నిషేధించలేమని రైతులు ఎక్కడి నుంచి వస్తున్నారు అనేది పోలీసు నిర్ణయించుకోవాలని, న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోలేదని తెలిపింది. తర్వాత ఎస్ కే యం, ఢిల్లీ పోలీసులు ట్రాక్టర్ పరేడ్‌కు సంబంధించిన రూట్ అలాగే ప్రవేశ మార్గాలు గురించి అవగాహనకు వచ్చాయి.

**రిపబ్లిక్ డే కిసాన్ ట్రాక్టర్ పరేడ్ :** ఎస్ కే యం ఆధ్వర్యంలో ఒక పెద్ద ట్రాక్టర్ పరేడ్ నిర్వహించారు. అనుమతి ఉన్న మార్గాల ద్వారా లక్షలాది ట్రాక్టర్లు అలాగే అంతకు మించి లక్షల సంఖ్యలో రైతులు శాంతియుతంగా పరేడ్ నిర్వహించారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్లతో ఈ పరేడ్‌ను నిర్వహించారు. అయితే, కొంతమంది రైతు గ్రూపులు అనుకున్న మార్గాల్లో వెళ్లకుండా అనుమతి లేని మార్గాల గుండా ఎర్రకోటకు చేరుకుని నిషాన్ సాహెబ్ పతాకాన్ని ఎగరేశారు. ఇలా జరిగిన అనుకోని సంఘటనలు రైతుల ప్రధాన డిమాండ్ల నుంచి దృష్టిని మళ్లించలేవు. మొత్తం రైతు ఉద్యమం ఈ సంఘటనను ఖండించింది. కొంతమంది పాలక పార్టీతో సంబంధం ఉన్నవాళ్ళే ఈ సంఘటనలకు బాధ్యులని తేలింది. అనుమతి ఉన్న మార్గాలలో కూడా పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించి రైతులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అడ్డంకులు కల్పించడంపై రైతులు సహజంగానే కోపోద్రిక్తులయ్యారు. ఇలాంటి పోలీస్ చర్యలను ఎవరూ క్షమించలేరు. వ్యవసాయ చట్టాలు రద్దు అయ్యేవరకూ పోరాటాన్ని కొనసాగించాలని ఎస్‌కేఎం నిర్ణయించింది. పార్టీ దీనికి పూర్తి మద్దతును ప్రకటించింది.

**పార్టీ చొరవ :** కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు వామపక్ష సంయుక్త కార్యాచరణను పెంచడంలో భాగంగా రైతు–కార్మిక పోరాటాలకు అలాగే డిసెంబర్ 8 భారత్ బంద్‌కు మద్దతు నిస్తూ వామపక్షాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. తాజాగా జనవరి 24న వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలన్నీ కలిసి ప్రకటన విడుదల చేశాయి.

కొనసాగుతున్న పోరాటాలకు మద్దతుగా వామపక్షేతర లౌకిక పార్టీలను సమీకరించడానికి మనం చొరవ తీసుకున్నాం. నవంబర్ 28న ఐదు వామపక్షాల ప్రధాన కార్యదర్శులతో పాటు శరద్ పవార్ (ఎన్‌సిపి), టి ఆర్ బాలు (డిఎంకె), మనోజ్ ఝా (ఆర్‌జెడి)లు వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ వాటిని రద్దు చేయలన్న డిమాండ్‌తో ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. తర్వాత మరింత విస్తృతమైన

మద్దతును కూడగట్టగలిగాము. దీని ఫలితంగా డిసెంబర్ 6న ఐదు వామపక్షాల ప్రధాన కార్యదర్శులు, సోనియా గాంధీ, శరద్ పవార్, ఏం కె స్టాలిన్, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్, అఖిలేష్ యాదవ్‌లు కలిసి ఒక సంయుక్త ప్రకటన ఇచ్చారు.

దీని తర్వాత భారత రాష్ట్రపతిని ఒక ప్రతినిధి బృందం కలిసింది. రాష్ట్రపతి భవన్ కోవిడ్ ప్రోటోకాల్ ప్రకారం అయిదుగురు సభ్యుల బృందం రాష్ట్రపతిని కలిసింది. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని తన ప్రభుత్వాన్ని ఆదేశించమని ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కోరింది. రాహుల్ గాంధీ, శరద్ పవార్, సీతారామ్ ఏచూరి, డి రాజా మరియు టి కె ఎస్ ఎలాన్ గోవన్ డిసెంబర్ 9న రాష్ట్రపతిని కలిసి మెమోరాండం ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి డిసెంబర్ 24న ఒక సంయుక్త ప్రకటన ఇచ్చాయి. వామపక్షాలతో పాటు రాహుల్ గాంధీ, శరద్ పవార్, టి ఆర్ బాలు, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వీ యాదవ్, అఖిలేష్ యాదవ్‌లు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

పదేపదే అబద్ధాలు చెపుతూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారనీ, రైతులను తమ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారన్న మోడీ ఆరోపణలను నాయకులు ఖండించారు.

నిరూపించబడ లేని ప్రధానమంత్రి ఆరోపణలను బట్టబయలు చేస్తూ వ్యవసాయ చట్టాలను అలాగే విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ సంస్కరణలపై రైతులతో, ఇతర భాగస్వాములతో కేంద్ర ప్రభుత్వం చర్చించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సంప్రదింపుల ఆధారంగా అవసరమనుకుంటే కొత్త చట్టాలను పార్లమెంట్ జాయింట్ లేదా స్పెషల్ సెషన్ ద్వారా తీసుకురావచ్చని వారు చెప్పారు.

జనవరి 7, 2021న పార్టీ అఖిలభారత కేంద్రం ఒక సర్క్యులర్‌ను రాష్ట్ర కమిటీలకు పంపించింది. రైతుల సమస్యలపై వారికి మద్దతుగా అన్ని రాజకీయ పార్టీలు, ఇతర శక్తులతో కలిసి రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించగల అవకాశాలను పరిశీలించాలని పార్టీ కేంద్రం చెప్పింది. కొన్ని రాష్ట్రాలలో సదస్సులను జయప్రదంగా నిర్వహించారు. పూర్తి నివేదిక కేంద్ర కమిటీ సమావేశమైనప్పుడు రాష్ట్రాల నివేదికలు అందినప్పుడు తెలుస్తుంది.

**వర్గ ప్రభావాలు :** ఈ రైతాంగ ఉద్యమం కొన్ని విషయాలను ముందుకు తెచ్చింది. వ్యవసాయాన్ని, దాని ఉత్పత్తులను, మార్కెట్లను తమ లాభాల గరిష్టీకరణ కోసం కార్పొరేట్ నియంత్రణలోకి తీసుకరావడానికి భారతదేశ పాలకవర్గ నాయకులు చేసిన ప్రయత్నాలను ఇది బహిర్గతపర్చింది. కోవిడ్ మహమ్మారి తదనంతరం విధించబడ్డ లాక్‌డౌన్ ఇదివరకే నెలకొని ఉన్న ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభాన్ని,

ఆర్థిక మాంద్యాన్ని మరింత తీవ్రతరం చేసిన నేపథ్యంలో భారత పాలకవర్గాలు ఈ ప్రయత్నం చేశాయి.

అంతర్జాతీయ పెట్టుబడితో సాన్నిహిత్యం ఉన్న బడా బూర్జువా, భారతదేశ రైతాంగం (ధనిక రైతులతో సహా) మధ్య ఇది ఒక సంఘర్షణను సృష్టించింది. ఈ వివాదం సృష్టించిన అవకాశాలను కార్మికవర్గం, పేదరైతులు, వ్యవసాయ కార్మికులు ఉపయోగించుకుని బూర్జువా-భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలి.

నయా-ఉదారవాద ఆర్థిక సంస్కరణలను కర్కశంగా అమలుచేయడం వల్ల బడా బూర్జువా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్ఎంఇ) రంగానికి చెందిన పెట్టుబడిదారుల మధ్య కొత్త వివాదాలు పుట్టుకొస్తున్నాయి. బడాబూర్జువా, చిన్న పెట్టుబడిదారుల మధ్య ఉన్న సంఘర్షణలు బిజెపి ఇంకా అది చేస్తున్న రాజకీయాలకు వ్యతిరేకంగా విశాల ఐక్యతను పెంచడానికి అవకాశాలను కలిగిస్తున్నది.

దేశ సమాఖ్య వ్యవస్థ స్థానంలో ఆధిపత్య రాజ్యాన్ని ఏర్పరచి తన ప్రాబల్యాన్ని పెంచుకోవాలన్న ఉద్దేశంతో ఉన్న బిజెపి, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులపై తీవ్రమైన దాడులను చేస్తున్నది. చాలా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలపై దాడులు జరుగుతున్నాయి. మత సమీకరణలు, ధృవీకరణలు చేసి తన ఆధిపత్యాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో ఉన్న బిజెపికి వ్యతిరేకంగా పలు ప్రాంతీయ పార్టీలు ముందుకు వస్తున్నాయి.

ఇప్పటికే చిరకాలం నుంచి మిత్రులుగా ఉన్న శివసేన మహారాష్ట్రలోను, అలాగే పంజాబ్‌లో అకాలీ దళ్ పార్టీలు ఏన్ డి ఏ నుంచి బయటకు వచ్చి బిజెపికి వ్యతిరేకంగా ఉన్నాయి.

బి జె పి ఇంకా అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు, బిజెపికి వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడానికి (ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభావపూరితంగా జోక్యం చేసుకొనే పరిస్థితులు లేని నేపథ్యంలో) అవకాశా లున్నాయి. పోరాటాలను మరింత ముందుకు తీసుకువెళ్ళే అవకాశాలు కూడా కార్మిక వర్గం, రైతాంగ పోరాటాల మధ్య నెలకొన్న సంయోగిత వల్ల పెరిగాయి. కార్మికవర్గం, రైతులు, వ్యవసాయకూలీలు మధ్య గత కొన్నేళ్ళుగా సంయుక్త కార్యాచరణలు పెరిగాయి. నవంబర్ 26-27న చేపట్టిన కార్యక్రమాలతో ఇది చాలా ఉన్నత స్థాయికి చేరుకున్నది.

దీనిని మరింత బలోపేతం చేసి కార్మికులు, రైతుల మధ్య వర్గ ఐక్యతను సాధించి కార్మిక-రైతు కూటమిని నిర్మించాలి. వ్యవసాయ చట్టాలకు అలాగే కార్మిక హక్కులను కాలరాచే కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను

రానున్న కాలంలో సంయుక్తంగా బలోపేతం చేయాలి.

**కేంద్ర కమిటీ పిలుపులు :** ఫిబ్రవరి రెండో పక్షంలో పార్టీ యూనిట్లన్నీ పదిహేను రోజులపాటు దేశవ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. రాజ్యాంగ వ్యవస్థను, ఆర్థిక పునాదులను మత ధృవీకరణాల ద్వారా ధ్వంసం చేసే చర్యలు, జాతీయ ఆస్తులను కొల్లగొట్టడం, పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ, పెరుగుతున్న ధరలు, కార్మిక చట్టాల రద్దు, పెరుగుతున్న నిరుద్యోగం మొదలగు విషయాలపై ప్రచారం కేంద్రీకరించాలి. ఇప్పుడు కొనసాగుతున్న రైతుల పోరాటానికి మద్దతు ఇవ్వడం అలాగే అర్ ఏస్ ఎస్/బిజెపి అబద్ధపు ప్రచారాలను ఎండగట్టడంపై దృష్టి సారించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

కార్మికుల, రైతుల పోరాటాలలోకి, అలాగే మద్దతు తెల్పడానికి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలి. సంస్థాగతంగా వీటిని బలోపేతం చేసుకొని కొత్త సెక్షన్లను ప్రజాసంఘాలలోకి, పార్టీలోకి వచ్చేట్లు ప్రయత్నించాలి.

పోరాటాలు వెల్లువెత్తుతున్న సమయంలో పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి కొత్త పిలుపులు ఇవ్వడం జరుగుతున్నది. మన పార్టీ యూనిట్స్ ఈ పిలుపులన్నీటికీ క్రియాశీలకంగా మద్దతు తెల్పాలి. ఇదే సమయంలో మన ప్రజాసంఘాలన్నీ ప్రస్తుతం జరుగుతున్న పోరాటాలకు మద్దతు ఇస్తూనే తమ తమ డిమాండ్ల సాధనకు శక్తివంతంగా పనిచేయాలి. పార్టీ కార్యకలాపాలు, ప్రచారాలు ఉపాధి, ఆహారం – ఈ రెండు అంశాలపై పూర్తిగా కేంద్రీకరించాలి.

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిని ఓడించడమే ధ్యేయంగా పని చేయాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. అలాగే కేరళలో సిపిఎం నాయకత్వంలో ఎల్ డి ఎఫ్ ని అధికారంలోకి తేవడం లక్ష్యంగా ఉండాలి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష లౌకిక ప్రజా తంత్ర ప్రత్యామ్నయం కోసం పనిచేయాలి. బిజెపి-ఏఐఏడిఏంకె కూటమిని ఓడించి డిఏంకె నాయకత్వంలోని ఫ్రంట్ విజయానికి పాటుపడాలి. అస్సాంలో పార్టీ బలాన్ని పెంచుకోవాలి.

* * *

ప్రతులు : 2500 ప్రచురణ కాలం : మార్చి, 2021 వెల : ₹10/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటి

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2,

ఫోన్ నెం. 0866 2577202, 9490099057